



www.aksharamtelugudaily.com RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

SUPHALA AKSHARAM

SUNDAY 26TH APRIL 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 09 ISSUE : 39 COST : 3\- KHAMMAM, TELANGANA

ఆదివారం 26 ఏప్రిల్ 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 09 సంచిక : 39 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI


## అజారుద్దీన్, కోదండ రామ్‌లకు ఊరట


### గవర్నర్ కోటా ఎమ్మెల్సీలకు గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్,ఏప్రిల్25 గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకానికి సంబంధించి రాష్ట్ర మంత్రివర్గం ప్రతిపాదించిన అజారుద్దీన్, కోదండరాం అభ్యర్థిత్వాలకు లైన్ క్లియర్ అయ్యింది. వారిద్దరి అభ్యర్థిత్వాలను ఆమోదిస్తూ గవర్నర్ శివప్రతాప్ శుక్లా సంతకం చేశారు. దీనిపై త్వరలో గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుంది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై


➤ 2వ పేజిలో..


# ఆర్టీసిని బలోపేతం చేయడమే లక్ష్యం

- సమ్మె సమయంలో కార్మికులతో చర్చించి పరిష్కరించాం
- ప్రజాప్రతినిధులతో జూమ్ కాల్‌లో చర్చించిన మంత్రి పొన్నం



హైదరాబాద్,ఏప్రిల్25 తెలంగాణ ఆర్టీసీని మరింత బలోపేతం చేయడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. రెండు రోజుల పాటు జరిగిన సమ్మె సమయంలోనే కార్మికులతో పలుమార్లు చర్చలు జరిపామని, వారి ప్రధాన డిమాండ్లను పరిష్కరిం చామని పేర్కొన్నారు. శనివారం ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్‌లు. అధికార ప్రతినిధులు, కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షులతో మంత్రి పొన్నం ప్రభాకర్ జూమ్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం కార్మికుల చిరకాల స్వప్నమని, దాన్ని తాము నెరవేర్చామని పేర్కొన్నారు. అలాగే కార్మిక సంఘాల ఎన్నికలు, 11శాతం పీఆర్సీ ప్రకటించడం వంటి అంశాలపై ఆర్టీసీ సిబ్బంది సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ నిర్ణయాలను చారిత్రాత్మకంగా అభివర్ణిస్తూ కార్మికులు సంబరాలు జరుపుకోవాలని నిర్ణయించారని.. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ కేడర్ కూడా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రుల బృందం సుమారు 15 గంటలపాటు కార్మికులతో చర్చలు జరిపి సమస్యలకు పరిష్కారం చూపామని తెలిపారు. ఇంకా మిగిలిన సమస్యలనూ కూడా దశలవారీగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో ఆర్టీసీ కార్మికులు 55 రోజులపాటు సమ్మె చేసినా, వారి డిమాండ్లు నెరవేర్చలేదని విమర్శించారు. ఆ సమయంలో 30 మందికి పైగా కార్మికులు ప్రాణాలు కోల్పోయారని మంత్రి పొన్నం ప్రభాకర్ గుర్తు చేశారు. తమ ప్రభుత్వానికి కార్మికులతో విభేదాలు లేవని, వారిని కుటుంబ సభ్యుల్లా భావిస్తున్నామని చెప్పారు. సమ్మె సమయంలో ఆత్మహత్య చేసుకున్న శంకర్ గౌడ్ కుటుంబానికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ శవ రాజకీయాలు చేయడం తగదని హితవు పలికారు. సమ్మె సమయంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు వ్యవహరించిన తీరు సరికాదని అభిప్రాయపడ్డారు. 2013 బాండ్లు, 2017 పీఆర్సీ, డీఏలు, సీసీఎస్, పీఎఫ్ బకాయిల చెల్లింపులు, కొత్త బస్సుల


➤ మిగతా 2వ పేజిలో..




### తొలి ప్రైవేటు ఆర్బిటల్

## రాకెట్ విక్రమ్-1

### జెండా ఊపి ప్రారంభించిన సిఎం రేవంత్

హైదరాబాద్,ఏప్రిల్25 హైదరాబాద్ స్కైరూట్ ఏరోస్పేస్ వేదికగా దేశపు తొలి ప్రైవేటు ఆర్బిటల్ రాకెట్ విక్రమ్-1 ప్రయాణం మొదలు కానుంది. ఇందులో భాగంగా మ్యాక్స్-క్యూ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, పలువురు అధికారులు హాజరయ్యారు. శ్రీహరి కోటకు పంపనున్న రాకెట్ విక్రమ్-1ను సీఎం జెండా ఊపి ప్రారంభించారు. ప్రీ పైలట్ పరీక్షలన్నింటినీ పూర్తి చేసుకొని తదుపరి ప్రయోగం కోసం.. సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్‌కు ఇది చేరుకోనుంది. ఇండియాలోనే


➤ మిగతా 2వ పేజిలో..


### మహిళ విద్యా,ఉపాధిపై

## ప్రభుత్వం దృష్టి

- లాభదాయక వ్యాపారాలపై దృష్టి సారించాలి
- టీనేజ్ బాలికల కోసం స్నేహ సమ్మర్ ప్రోగ్రామ్
- మంత్రి సీతక్క వెల్లడి



హైదరాబాద్,ఏప్రిల్25 మహిళల విద్య, ఉపాధిపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. మహిళల ఆర్థికాభివృద్ధికి క్రమశిక్షణ, లాభదా యక వ్యాపారాలపై దృష్టి పెట్టాలని సూచించారు. టీనేజ్ బాలికల కోసం స్నేహ సమ్మర్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. లైఫ్ స్కిల్స్, భద్రత, సైకిల్ ట్రైనింగ్ కార్యక్ర మాలు చేపడుతామని.. ఈఓఓఓ కార్యక్రమాలను బాలికలంతా సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సీతక్క దిశానిర్దేశర చేశారు. త్వరలో మహిళా సంఘ సభ్యుల ఎడ్యుకేషన్


➤ మిగతా 2వ పేజిలో..


## మే9న ప్రధాని మోడీ పర్యటన

### రాష్ట్రంలో పలు ప్రాజక్టులకు ప్రారంభోత్సవాలు



హైదరాబాద్,ఏప్రిల్25 ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణలో వచ్చే నెల 9వ తేదీన పర్యటించనున్నారు. ప్రధాని పర్యటనలో భాగంగా సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించే అవకాశం ఉంది. ఈ పర్యటనలో ప్రధానంగా రాష్ట్రంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారని తెలుస్తోంది. అలాగే ఇప్పటికే పూర్తయిన కొన్ని ప్రాజెక్టులను జాతికి అంకితం చేసే కార్యక్రమాలు కూడా ఉండే అవకాశముంది. ముఖ్యంగా ఎంఎంటిఎస్ 2ను జాతికి అంకితం చేసే అంశం ఈ పర్యటనలో ప్రధానంగా ఉండొచ్చని సమాచారం. హైదరాబాద్ నగర రవాణా వ్యవస్థను


➤ మిగతా 2వ పేజిలో..




## తెలంగాణ రాష్ట్ర సేన ఆవిర్భావం

- కవిత సంచలన నిర్ణయం
- బీఆర్ఎస్‌పై ఘాటు విమర్శలు
- కుటుంబ రాజకీయాల్లో విభేదాల వెల్లడి
- కొత్త పార్టీ లక్ష్యాల ప్రకటన

హైదరాబాద్, ఏప్రిల్ 25 తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక మలుపు తిరిగింది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీని


➤ మిగతా 2వ పేజిలో..


### అసంపూర్తిగా వదిలేసిన

## ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం

- ఎన్నికల హామీలు నెరవేర్చే దిశగా అడుగులు వేస్తున్నాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి
- 27 న రెవెన్యూ,హౌసింగ్ అంశాలపై మంత్రి సమీక్షలు
- ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లా సమావేశాలు



హైదరాబాద్,ఏప్రిల్25 బీఆర్ఎస్ పాలనలో అసం పూర్తిగా వదిలేసిన ప్రాజెక్టులను పూర్తి చేస్తూ ముందుకు వెళ్తున్నామని రెవెన్యూ మంత్రి పొంగులేటి తెలిపారు. గత ప్రభుత్వం ప్రారంభించిన పథకాలతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూడా ప్రజా ప్రభుత్వం నెరవేరుస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్షం చేస్తున్న అసత్య ఆరోపణలను లెక్కచేయకుండా, పేదవాడే ఎజెండాగా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వివరించారు. భూములకు సంబంధించిన సమస్యలపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని పొంగులేటి తెలిపారు. వచ్చే 50 రోజుల్లో సాదాబైనామా అంశాల్లో న్యాయమైన సమస్యలు ఉంటే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ప్రజలకు న్యాయం చేయడమే ప్రభుత్వ ఉద్దేశమని, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తామని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే ఇందిరమ్మ ఇళ్లు, రెవెన్యూ అంశాలపై రాష్ట్ర రెవెన్యూ, హసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం నుండి క్షేత్రస్థాయి సమీక్షలకు శ్రీకారం


➤ మిగతా 2వ పేజిలో..


## మమత, మోడీ..ఇద్దరూ ఇద్దరే

- రెండు సిద్ధాంతాల మధ్య పోరాటం
- మోదీ, మమతపై రాహుల్ గాంధీ విమర్శలు
- ధనవంతులకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపణ
- బంగాల్ ప్రచారంలో ఘాటు వ్యాఖ్యలు



హూగ్లీ, ఏప్రిల్ 25 దేశంలో ప్రస్తుతం రెండు విభిన్న సిద్ధాంతాల మధ్య పోరాటం కొనసాగుతోందని లోక్‌సభ ప్రతి పక్షనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఒకవైపు కాంగ్రెస్ పార్టీ ఐకమత్యం, సోదరభావం కోసం పని చేస్తుంటే, మరోవైపు బీజేపీ విద్వేష రాజకీయాలు నడుపుతోందని విమర్శిం చారు.పశ్చిమ బెంగాల్‌లోని హూగ్లీ జిల్లాలో నిర్వహించిన రెండో విడత ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాహుల్ గాంధీ, ప్రధాని నరేంద్ర మోదీ మరియు సీఎం మమతా బెనర్జీపై తీవ్ర ఆరోపణలు చేశారు.

మోదీ, మమత ఇద్దరూ ఒకటేనని, వారు ధనవంతులకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. అధికారమే వారికి ముఖ్యమని, పేదల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. "ప్రధాని మోదీ ప్రజల కోసం ఏమీ చేయరు. కొంతమంది పారిశ్రామికవేత్తల


➤ మిగతా 2వ పేజిలో..

## అజారుద్దీన్, కోదండ రామ్‌లకు ఊరట

గత మూడేళ్లుగా వివాదం కొనసాగుతోంది. ఈ నెల 30 లోగా ఎమ్మెల్సీ కాకపోతే అజారుద్దీన్ మంత్రి పదవి కోల్పోనున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలను త్వరగా పరిశీలించాలని గవర్నర్‌ను ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఈ నేపథ్యంలో రాష్ట్రమంత్రి వర్గం ప్రతిపాదించిన పేర్లను ఆమోదిస్తూ గవర్నర్ తాజాగా సంతకాలు చేశారు. దీంతో ఈ ఇద్దరు ఇక ఎమ్మెల్సీలుగా కొనసాగనున్నారు.

### తొలి ప్రైవేటు ఆర్బిటల్

## రాకెట్ విక్రమ్-1

తొలి ప్రైవేట్ రాకెట్ గా రికార్డుకెక్కిన విక్రమ 1 రాకెట్ ను ఫ్లాగ్ ఆఫ్ చేసి శ్రీహరి కోటకు పంపారు సీఎం రేవంత్ రెడ్డి. 2026 ఏప్రిల్ 25న శంషాబాద్ ఏరోస్పేస్ పార్క్‌లోని స్కైరూట్ సంస్థను సందర్శించారు సీఎం. ఆ సంస్థ తయారు చేసిన భారత తొలి ప్రైవేట్ కమర్షియల్ రాకెట్ విక్రమ్-1 గురించి తెలుసుకున్నారు. స్కైరూట్ సంస్థలో రాకెట్ తయారీ, టెక్నాలజీ తదితర అంశాల గురించి చర్చించారు. తొలి ప్రైవేట్ రాకెట్ తయారు చేసిన సంస్థ యాజమాన్యాన్ని అభినందించారు. రాకెట్ ను శ్రీహరికోట లోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి లాంచ్ చేయనున్నారు. దీంతో సీఎం రేవంత్ జెండా ఊపి శ్రీహరి కోటకు పంపారు. హైదరాబాద్‌కు చెందిన స్పేస్‌టెక్ స్టార్టప్ స్కైరూట్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన విక్రమ్-1 భారతదేశపు మొట్టమొదటి ప్రైవేట్ కమర్షియల్ ఆర్బిటల్ రాకెట్. 2025 నవంబర్‌లో ఈ రాకెట్ ను ఆవిష్కరించారు. 480 కిలోల బరువున్న ఉపగ్రహాలను తక్కువ భూ కక్ష్యలోకి తీసుకెళ్లగలదు దీనిని పూర్తిగా కార్బన్ ఫైబర్‌తో నిర్మించడం విశేషం. ఇది 3ఆ ప్రింటెడ్ ఇంజన్‌లను కలిగి ఉంది.. పూర్తిగా కార్బన్్గ÷బైర్ బాడీ రాకెట్. కార్బన్్గ÷బైర్ వాడటం వలన ఇది తేలికగా, బలంగా ఉంటుంది. సుమారు 300 - 480 కిలోల బరువున్న ఉపగ్రహాలను 500 కిలోమీటర్ల లో ఎర్త్ ఆర్బిట్ లోకి ప్రవేశపెట్టగలదు. 2026 లో త్వరలో అంతరిక్షంలోకి వెళ్లనుంది. భారత అంతరిక్ష పితామహుడు విక్రమ్ సారాభాయ్ పేరు మీద ఈ రాకెట్‌కు 'విక్రమ్-1' అని పేరు పెట్టారు. ఇది పూర్తి స్వదేశీ సాంకేతికత తో, 100శాతం భారతదేశంలోనే తయారైంది.

## మమత, మోడీ..ఇద్దరూ ఇద్దరే

➢ మొదటి పేజి తరువాయి

కోసం మాత్రమే పనిచేస్తారు. దాని ప్రయోజనం కేవలం బీజేపీ నాయకులకు, వారి సంస్థలకు మాత్రమే చేరుతుంది" అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.బంగాల్‌లో కూడా ఇదే పరిస్థితి ఉందని పేర్కొంటూ, ఉపాధి పొందాలంటే టీఎంసీతో సంబంధాలు ఉండాల్సిందేనని ఆరోపించారు. టీఎంసీ నాయకులు, అనుచరులకే ప్రాధాన్యం ఇస్తూ సామాన్య ప్రజలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాజకీయాల్లో విలువలు, ప్రజాసేవ ముఖ్యం కావాలని, విభజన రాజకీయాలను ప్రజలు తిరస్కరించాలని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. ఈ వ్యాఖ్యలు ఎన్నికల వాతావరణంలో చర్చనీయాంశంగా మారాయి.

# మే9న ప్రధాని మోడీ పర్యటన

➢ మొదటి పేజి తరువాయి

మెరుగుపరిచే ఈ ప్రాజెక్ట్ ప్రజా ప్రయాణానికి కీలకంగా మారనుంది. అలాగే ఎయిమ్స్ బీబీనగర్ ఆస్పత్రిని కూడా జాతికి అంకితం చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ ఆస్పత్రి తెలంగాణతో పాటు సమీప రాష్ట్రాల ప్రజలకు కూడా వైద్యసేవల్లో పెద్ద మార్పు తీసుకురానుంది. ఇవే కాకుండా రాష్ట్రంలో పలు జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపనలు చేయనున్నారని సమాచారం.

రవాణా, కనెక్టివిటీ రంగాల్లో ఈ ప్రాజెక్టులు కీలకమని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. ఇక మరో అంశంగా మల్లారెడ్డి యూనివర్సిటీ పర్యటన కూడా ప్రధాని షెడ్యూల్‌లో ఉండొచ్చని చర్చ జరుగుతోంది. అయితే ఇది ఇంకా అధికారికంగా ఖరారు కాలేదని తెలుస్తోంది. ప్రధాని మోదీ పర్యటన తెలంగాణ అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభాలు, రవాణా మౌలిక సదుపాయాల విస్తరణ, ఆరోగ్య రంగంలో కొత్త సదుపాయాలపై కేంద్రీకృతమై ఉండే అవకాశాలు ఉన్నాయి. ప్రధాని అధికారిక షెడ్యూల్ పూర్తిగా ప్రకటించాల్సి ఉంది.

## ఆర్టీసిని బలోపేతం చేయడమే లక్ష్యం

➢ మొదటి పేజి తరువాయి

కొనుగోలు, ఉద్యోగాల భర్తీ, కారుణ్య నియామకాలు వంటి అనేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అలాగే సర్వీసు నుంచి తొలగించిన కార్మికులను తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకున్నామని ప్రస్తావించారు. ప్రస్తుతం రోజుకు సుమారు 65 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ సేవలను వినియోగిస్తున్నారని తెలిపారు. పేదలకు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కోసం ఆర్టీసీ ఒక లైఫ్ లైన్‌లా పనిచేస్తోందని మంత్రి పొన్న ప్రభాకర్ పేర్కొన్నారు.

## ఏ బి ఏ పి తమిళ్ నాడు ఎన్నికల అధికారిగా జనగామ తిరుపతి



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఏప్రిల్ 24 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ అంతర్గత ఎన్నికలలో భాగంగా తమిళ్ నాడు రాష్ట్రంలో ఈ నెల 25, 26 న డిండిగల్, త్రిచ్చి, కరూర్, తిరుప్పూర్ జిల్లాలో జరిగే ఏ బి ఏ పి ఎన్నికలకు గోదావరిఖని నుండి ఆసంస్థ తెలంగాణ రాష్ట్ర పి ఆర్ ఓ జనగామ తిరుపతి ఎన్నికల అధికారిగా నియమితులయ్యారు. ఈ అవకాశం కల్పించిన అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ జాతీయ అధ్యక్షులు శ్రీ అయ్యప్ప దాస్ కి, ట్రస్ట్ సెక్రెటరీ వెంకటేషన్ కి, వంశీ కృష్ణ కి జనగామ తిరుపతి ధన్యవాదములు తెలిపారు. అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభను తమిళ్ నాడు రాష్ట్రంలో మరింత పటిష్టపరుచట కోసం పారదర్శకంగ ఎన్నికలు నిర్వహించడం జరుగుతుంది అని ఆయన తెలిపారు. ఈసందర్బంగా తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు చల్లా రవీందర్ రెడ్డి మరియు పలువురు అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ సభ్యులు జనగామ తిరుపతి కి అభినందనలు తెలిపారు

## మహిళ విద్యా,ఉపాధిపై ప్రభుత్వం దృష్టి

➢ మొదటి పేజి తరువాయి

ప్రొఫైల్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. మహిళల విద్యార్హతలను గుర్తించి ఉన్నత విద్య అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. శనివారం బీఆర్‌కే భవన్‌లో సెర్ప్ డైరెక్టర్లు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షులతో మంత్రి సీతక్క సమీక్షా సమావేశం నిర్వహించారు. మహిళా సంఘ భవనాల నిర్మాణం, 'అమ్మకు అక్షరమాల', సెర్ప్ కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడారు. ప్రతి మహిళా అక్షరాస్యురాలిగా ఉండటమే తమ ప్రభుత్వ లక్ష్మని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. 5,239 గ్రామాల్లో మహిళా భవనాల నిర్మాణ పనులు ఊపందుకున్నాయని వెల్లడించారు. ఇప్పటికే కొన్ని వీఓ భవనాలు పూర్తి అయ్యాయని తెలిపారు. ఈ పనులను వేగవంతం చేస్తున్న అధికారులకు అభినందనలు తెలిపారు. వచ్చే ఏడాది మరో 5,000 వీఓ భవనాలను నిర్మిస్తామని చెప్పుకొచ్చారు. 'అమ్మకు అక్షరమాల' ద్వారా ఇప్పటివరకు 6.5 లక్షల మహిళలకు అక్షరజ్ఞానం కల్పించామని వెల్లడించారు. త్వరలో మరో 6.5 లక్షల మహిళలకు గ్రామాల్లోనే విద్యాబోధన కల్పిస్తామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. మహిళా సంఘాలు.. బాల్య వివాహాల వంటి సామాజిక రుగ్మతల నిరోధంలో ముందుండాలని పిలుపునిచ్చారు.

## తెలంగాణ రాష్ట్ర సేన ఆవిర్భావం

ప్రకటించడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. 'తెలంగాణ రాష్ట్ర సేన' పేరుతో తన రాజకీయ ప్రయాణాన్ని కొత్త దిశలో ప్రారంభిస్తూ కవిత రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్‌లో నిర్వహించిన భారీ సభలో కవిత పార్టీ పేరుతో పాటు జెండాను కూడా ఆవిష్కరించారు. పసుపు, ఆకుపచ్చ, నీలం రంగులతో రూపొందించిన జెండా మధ్యలో తెలంగాణ మ్యాప్ ఉండగా, దానిపై పార్టీ పేరును ప్రతిబింబించే అక్షరాలు కనిపించాయి. ఈ సభకు పెద్ద ఎత్తున కార్యకర్తలు, అనుచరులు హాజరై కొత్త పార్టీకి మద్దతు తెలిపారు. సభలో మాట్లాడిన కవిత బీఆర్ఎస్ పార్టీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. పార్టీ తెలంగాణ ఆత్మను కోల్పోయిందని, నాయకత్వం ప్రజల సమస్యల నుండి దూరమైందని ఆరోపించారు. ఉద్యమ నాయకుడిగా పేరొందిన కేసీఆర్ అభివృద్ధి మార్గం తప్పిందని, ప్రస్తుతం ఉన్న పరిస్థితులు ప్రజలకు అనుకూలంగా లేవని పేర్కొన్నారు. తన తండ్రి కేసీఆర్‌పై కూడా కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో ఉన్న నాయకత్వం ప్రస్తుతం మారిపోయిందని, ప్రజల కోసం పనిచేసే స్వభావం తగ్గిపోయిందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజలు కష్టాల్లో ఉన్నా స్పందన లేకపోవడం బాధాకరమని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని తాను ముందే హెచ్చరించినా పట్టించుకోలేదని ఆరోపించారు. తనను పార్టీ నుంచి తప్పించడం తనకు స్వేచ్ఛనిచ్చిందని, ఇప్పుడు రాష్ట్ర ప్రజల కోసం నిస్వార్థంగా పోరాడతానని కవిత వెల్లడించారు. గతంలో జరిగిన తప్పుల్లో తన పాత్ర ఉన్నదని అంగీకరిస్తూ, వాటిని సరిదిద్దుకోవడానికి ఈ కొత్త రాజకీయ ప్రయాణం ప్రారంభించానని చెప్పారు.సామాజిక తెలంగాణ సాధనే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని కవిత స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి వర్గానికి న్యాయం చేయడం, ప్రజల సమస్యలను పరిష్కరించడం తమ ముఖ్య ధ్యేయమని చెప్పారు. రెండు సంవత్సరాల్లో అధికారంలోకి వచ్చి, తెలంగాణకు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతానని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ ప్రకటనకు ముందు బంజారాహిల్స్ నివాసంలో సర్వమత ప్రార్థనలు నిర్వహించి, గన్ పార్క్‌లో అమరవీరుల స్మారక స్థూపం వద్ద నివాళులర్పించడం ద్వారా తన సంకల్పాన్ని తెలియజేశారు.

## అసంపూర్తిగా వదిలేసిన ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం

➢ మొదటి పేజి తరువాయి

చుట్టనున్నారు. ఈ మేరకు హిమాయత్‌నగర్ లోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఉదయం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మధ్యాహ్నం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజా ప్రతినిధులు, కలెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సంబంధించి ఇటువంటి సమావేశాలను దశలవారీగా నిర్వహించనున్నారు. రాష్ట్రంలో తొలి విడతగా మూడున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు. సుమారు లక్షకు పైగా ఇళ్ళు గృహ ప్రవేశాలకు సిద్ధమైన నేపథ్యంలో మంత్రి గారు నిర్వహించే ఈ సమావేశం ప్రాధాన్యతను సంతరించుకుంది. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పూర్తి, కేటాయింపు, మౌలిక వసతుల కల్పన వంటి విషయాలను కూడా చర్చించనున్నారు. అంతేగాక త్వరలో రెండవ విడత ఇళ్ల మంజూరుకు సంబంధించి కూడా ఈ సమావేశంలో చర్చించే అవకాశాలు ఉన్నాయి. అదేవిధంగా భూ వివాదాలు, పట్టాదారు పాస్ పుస్తకాల జారీ,తాజాగా అమలు చేస్తున్న భూధార్ , సర్వేమ్యాప్‌ల వంటి కీలక రెవెన్యూ అంశాలపై జిల్లా అధికారులతో మంత్రి చర్చించనున్నారు. ఈ సమావేశంలో ఆయా జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొంటారు. అలాగే జిల్లా కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు, ఆర్డీవోలు, జిల్లా హౌసింగ్ అధికారులు పాల్గొననున్నారు.

## మరో 47మంది అజ్ఞాత మావోల లొంగుబాటు

- **గణపతి తదితరులు ఇంకా అజ్ఞతంలోనే ఉన్నారు**
- **తెలంగాణ డిజిపి శివధర్ రెడ్డి వెల్లడి**

హైదరాబాద్,ఏప్రిల్25 తెలంగాణలో మావోయిస్టు ఉద్యమం అంతిమదశకు చేరుకోవడంతో మిగిలిన వారు కూడా లొంగుబాట పట్టారు. రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మొత్తం 47 మంది అజ్ఞాత మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయి జనజీవన స్రవంతిలో చేరారు. లొంగిపోయిన వారిలో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు, అలాగే దక్షిణ బస్తర్ డివిజనల్ కమిటీకి చెందిన కీలక నేతలు ఉన్నారు. ముఖ్యంగా హేమ్లా ఇతు (అలియాస్ విజ్జా), పోడియం లచ్చు (అలియాస్ మనోజ్) వంటి నాయకులు ఈ జాబితాలో ఉన్నారని డీజీపీ తెలిపారు. లొంగుబాటు సందర్భంగా మావోయిస్టులు భారీగా ఆయుధాలు కూడా అప్పగించారు. మొత్తం 32 ఆయుధాలు, అలాగే 515 తూటాలు పోలీసులకు సమర్పించినట్లు డీజీపీ వెల్లడించారు. వీటిలో ఎకె-47, పలు రకాల రైఫిల్స్‌తో పాటు పిస్టల్స్, రివాల్వర్, మస్కెట్ గన్స్ వంటి వివిధ రకాల ఆయుధాలు ఉన్నాయి.తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పునరావాస విధానం కారణంగా ఈ మావోయిస్టు కేడర్లు లొంగుబాటుకు ముందుకొచ్చారని చెప్పారు. దక్షిణ బస్తర్ డివిజన్ ప్రస్తుతం పూర్తిగా నిర్వీర్య స్థితికి చేరిందని కూడా డీజీపీ వ్యాఖ్యానించారు. లొంగిపోయిన వారిలో ఖఒఉం బెటాలియన్‌కు చెందిన 4 మంది, ఆఐ÷ూజిఅకు చెందిన 28 మంది, అలాగే 9వ, 30వ ప్లాటూన్‌లకు చెందిన 15 మంది ఉన్నారని వివరించారు. ఇక తెలంగాణకు చెందిన కొంతమంది కీలక మావోయిస్టు నాయకులు ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. వారిలో లక్ష్మణరావు (గణపతి), పసునూరి నరహరి (సంతోషం), జాడి రత్నాభాయ్ (సుజాత), వార్త శేఖర్ (మంగు) ఉన్నారని పేర్కొన్నారు. వీరిని కూడా లొంగిపోవాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు. మావోయిస్టు ఉద్యమంపై తెలంగాణలో భద్రతా బలగాల చర్యలు మరింత ప్రభావం చూపుతున్నాయని డీజీపీ తెలిపారు. నజీవన స్రవంతిలో చేరి తెలంగాణ ప్రభుత్వ లొంగుబాటు, పునరావాస విధానం ద్వారా లభించే అన్ని ప్రయోజనాలను పొందాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు.

## జర్నలిస్టుల సమస్యలపై రాజీలేని పోరాటం: ఎన్.యు.జె. (ఐ) జాతీయ కార్యవర్గ సమావేశాల పిలుపు




- **హైదరాబాద్ వేదికగా రెండ్రోజుల సదస్సు విజయవంతం..**
- **'తెలంగాణ రైజింగ్' పై జాతీయ ప్రతినిధులకు వివరణ.**

హైదరాబాద్ / ఏప్రిల్ 25/ అక్షరం న్యూస్ -: దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సవాళ్లు, వారి సంక్షేమమే ధ్యేయంగా నేషనల్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐ) జాతీయ కార్యవర్గ సమావేశాలు హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించబడ్డాయి. సంస్థ జాతీయ అధ్యక్షులు శ్రీ సురేష్ శర్మ అధ్యక్షతన జరిగిన ఈ రెండ్రోజుల సదస్సులో జర్నలిస్టుల భద్రత, హక్కుల సాధనపై కీలక తీర్మానాలు చేశారు.

తొలిరోజు: శ్రామిక జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యం – – మంత్రి శ్రీ గడ్డం వివేక్ వెంకటస్వామి

సమావేశాల మొదటి రోజు కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర కార్మిక సంక్షేమ, గనుల శాఖ మంత్రి శ్రీ గడ్డం వివేక్ వెంకటస్వామి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజ గమనాన్ని నిర్దేశించే జర్నలిస్టులను కూడా కార్మిక సంక్షేమ పరిధిలోకి తీసుకువచ్చి, వారి హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, ఆరోగ్య బీమా వంటి సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు.

రెండవ రోజు: ప్రజాస్వామ్య రక్షణలో జర్నలిస్టుల పాత్ర– ప్రభుత్వ విప్ శ్రీ బీర్ల ఐలయ్య

రెండవ రోజు సమావేశాలకు తెలంగాణ ప్రభుత్వ విప్ శ్రీ బీర్ల ఐలయ్య ముఖ్య అతిథిగా హాజరై శ్రీకారం చుట్టారు. పాలకులకు, ప్రజలకు మధ్య వారధిగా నిలిచే జర్నలిస్టుల పాత్రను ఆయన కొనియాడారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి జాతీయ స్థాయిలో పోరాడాల్సిన అవసరం ఉందని, అందుకు తమ ప్రభుత్వం పూర్తి సహకారాన్ని అందిస్తుందని స్పష్టం చేశారు.

తెలంగాణ రైజింగ్: అభివృద్ధి పథంలో నవ రాష్ట్రం

ఈ సమావేశాలలో ప్రధాన ఆకర్షణగా "తెలంగాణ రైజింగ్" అంశం నిలిచింది. ఈ సెషన్‌లో హాజరైన ప్రభుత్వ ప్రతినిధులు, వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన జాతీయ స్థాయి జర్నలిస్టులకు తెలంగాణ అభివృద్ధి నమూనాను సమగ్రంగా వివరించారు.

కీలక తీర్మానాలు

సమాస్థ జాతీయ అధ్యక్షులు సురేష్ శర్మ మాట్లాడుతూ.. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు 'జర్నలిస్ట్ ప్రొటెక్షన్ యాక్ట్'ను దేశవ్యాప్తంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. వేతన బోర్డుల ఏర్పాటు, డిజిటల్ మీడియా జర్నలిస్టులకు గుర్తింపు వంటి అంశాలపై తీర్మానాలు ఆమోదించారు.

హైదరాబాద్ ఆతిథ్యం, తెలంగాణ అభివృద్ధిని చూసి జాతీయ ప్రతినిధులు అబ్బురపడ్డారు. ఈ సమావేశం జర్నలిస్టుల ఐక్యతకు కొత్త శక్తిని ఇచ్చిందని సురేష్ శర్మ అన్నారు. ఈ రెండు రోజుల సదస్సు తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం నారగౌని నేతృత్వంలో జరుగగా సంస్థ ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమానికి దేశంలోని వివిధ రాష్ట్రా పార్టీనిధులు హాజరయ్యారు. కాగా ఈ కార్యక్రమాలలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు శ్రీమతి హనూమాండ్ల ఝాన్సీ, వరంగల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు శ్రీ ఆయూబ్, డెమాక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షులు శ్రీ వివేక్, సామాజిక వేత్త శ్రీ కరాటే ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశాల్లో తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## అన్నపూర్ణ ఫౌండేషన్‌కు ఆర్థిక సాయం



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /ఏప్రిల్ -25(అక్షరం న్యూస్ )

దాతృత్వం అనేది బలమైన పాజిటివ్ ఎమోషన్. పంచుకోవడంలోని ఆనందం అనిర్వచనీయం. దీనివల్ల మన జీవితానికి సార్థకత లభించిన అనుభూతి కలుగుతుంది. లేనివారితో పంచుకోవడం ఉన్నవారి బాధ్యత కూడా. కాబట్టే, ఆర్థిక మానసిక వేత్తలు దాతృత్వాన్ని 'మానవీయ పెట్టుబడి'గా అభివర్ణిస్తారు. ఆలా ముస్తాబాద్ మండలం గూడెం గ్రామం లో ఉన్న అన్నపూర్ణమ్మ ఫౌండేషన్ కు కరెడ్ల శ్రీనివాస్ రెడ్డి తెలంగాణ స్టేట్ పోలీస్ వెల్ సెల్ డి ఎస్ పి పదివేల రూపాయల చెక్కు జె రాందాస్ అసిస్టెంట్ కమాండ్తిన్నావా టి జి ఎస్ పి 17 వ బెటాలియన్ సిరిసిల్ల డి ఎస్ పి రు 5000 వేల రూపాయలు ఫౌండేషన్ కు అందచేసారు వారికి ఫౌండేషన్ తరపున నిర్వాహకులు ధన్యవాదాలు తెలియచేశారు

## ఆర్టీసీ సమ్మెకు మద్దతు తెలిపిన వారందరికి కృతజ్ఞతలు



జనగామ జిల్లా/ రఘునాథపల్లి/( అక్షరం న్యూస్), ఏప్రిల్ 25:

ఆర్టీసీ సమ్మెకు మద్దతు తెలిపిన వారందరికి ప్రత్యేక కృతజ్ఞతలు అని రఘునాథపల్లి మండలానికి చెందిన జనగామ డిపో జేఏసీ నాయకుడు కుర్ర సురేందర్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధన కోసం జరిగిన సమ్మెలో సహచర కార్మికుడు శంకర్ గౌడ్ మృతి చెందడం భాదాకరమని, సమ్మెకు మద్దతు తెలిపిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యాదగిరి, వీరేందర్, మమత, నర్సయ్య, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ కాపీలు అందజేత



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /ఏప్రిల్ -25(అక్షరం న్యూస్ )

ముస్తాబాద్ మండలం చీకోడ్ గ్రామం లో గ్రామ సర్పంచ్, బొమ్మేన ఆంజనేయులు, పంచాయతీ పాలక వర్గం, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో. అర్హులైన ఇద్దరికి కొప్పు పద్మ, ఈరుగు రేఖ లకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ కాఫీలు పంపిణీ చేశారు.లబ్ధిదారులకు పత్రాలను అందజేస్తూ, సకాలంలో నిర్మాణ పనులు ప్రారంభించాలని సూచించారు.గ్రామానికి తొలి విడుత 33ఇళ్ళు మంజూరు కాగా ఒక ఇల్లు వాపసు పోయింది అని ప్రస్తుతం అదనంగా రెండు ఇండ్లు మంజురు అయినవి అని తెలిపారు .ఈ కార్యక్రమం లో సర్పంచ్ బొమ్మేన ఆంజనేయులు, ఉపసర్పంచ్ అస రంజిత్, వార్డు సభ్యులు గున్నాల వెంకటస్వామి గౌడ్, గున్నాల రేఖ వెంకటస్వామి గౌడ్,ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు కొప్పు రమేష్,ఒన్నాజీ పేట హరీష్,కాంగ్రెస్ పార్టీ నాయకులు కరెడ్ల కొండల్ రెడ్డి,చర్ల పల్లి కొండల్ రెడ్డి,గ్రామ పంచాయతీ కార్యదర్శి బాలకిషన్, లబ్ధిదారులు పాల్గొన్నారు

## వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గురుపూజ



మంచిర్యాల జిల్లా/మందమర్రి/ ఏప్రిల్ 25/ అక్షరం న్యూస్ -:

వీరబ్రహ్మేంద్ర స్వామి దీక్ష చివరి రోజు సందర్భంగా శనివారం మందమర్రి పట్టణంలో గల శ్రీ మద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో గురుపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కుష కుమార్ చారి ప్రత్యేక పూజలు నిర్వహించారు, గురువులు పెద్దపెల్లి వెంకటరమణ చారి, దేవోజు రాజశేఖర్ స్వాములను సత్కరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తదనంరం దీక్ష స్వాములు బ్రహ్మం మఠంలో జరుగు ఆరాధన ఉత్సవాలకు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గురుస్వామి కస్తూరి నరసింహ చారి, దీక్ష స్వాములు గొల్లపెల్లి బ్రహ్మచారి, అబ్బోజు నాగరాజు,తాటికొండ నాగరాజు, వేమునూరి నరేష్, భగవాన్ చారి, వీర బ్రహ్మేంద్ర స్వామి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# హిందూ ఐక్యతతోనే దేశాభివృద్ధి

- ఘనంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది విరాట్ హిందూ సమ్మేళనం
- ముఖ్య వక్తగా జిన్నా సత్యనారాయణ రెడ్డి
- భారీగా తరలివచ్చిన హిందూ బంధువులు

జ్యోతి నగర్ ఎన్టిపిసి ఏప్రిల్ 25 పెద్దపల్లి జిల్లా అక్షర న్యూస్

హిందూ సమాజం ఏకతాటిపైకి వచ్చినప్పుడే దేశం సుభిక్షంగా ఉంటుందని ఆర్ఎస్ఎస్ ప్రముఖులు జిన్నా సత్యనారాయణ రెడ్డి అన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన 'విరాట్ హిందూ సమ్మేళనం' శనివారం భక్తిశ్రద్ధల మధ్య ఉత్సాహంగా సాగింది. ముందుగా జ్యోతి ప్రజ్వలనం చేసి ,భరత మాతకు,శివాజీ మహరాజ్ కు నివాళులు అర్పించి కర్యక్రమం ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. వందేళ్ల సంఘ్ ప్రస్థానంలో ఎందరో మహానుభావుల త్యాగాలు ఉన్నాయని, హిందూ ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని





పిలుపునిచ్చారు.సమ్మేళనంలో పాల్గొన్న మహిళా శక్తి ప్రతినిధి డాక్టర్ ఇందిర మాట్లాడుతూ.. భావితరాలకు భారతీయ సంస్కృతిని, సనాతన ధర్మ విశిష్టతను అందించడంలో మహిళలు ముందుండాలని కోరారు. ఇస్కాన్ ప్రచారకులు హృషికేష్ ప్రసంగిస్తూ.. ఆధ్యాత్మిక చింతనతోనే సమాజంలో మార్పు సాధ్యమని వివరించారు.విరాట్ హిందూ సమ్మేళనం అధ్యక్షులు వోల్లాల సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభకు జనం పోటెత్తారు. కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షించిన కార్యదర్శి నల్లి నరేష్ మాట్లాడుతూ.. హిందూ సమాజాన్ని జాగృతం చేసేందుకు ఇలాంటి సమ్మేళనాలు ఎంతగానో దోహదపడతాయన్నారు.సమ్మేళనం సందర్భంగా పరిసర ప్రాంతాలన్నీ కాషాయమయమయ్యాయి. క్రమశిక్షణతో కూడిన స్వయంసేవకుల కవాతు, దేశభక్తి నినాదాలతో సభా ప్రాంగణం మార్మోగింది. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మలేరియా రహిత జిల్లాగా మార్చాలి

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రజిత

రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /ఏప్రిల్ -25(అక్షరం న్యూస్ )

రాజన్న సిరిసిల్ల జిల్లా ను మలేరియా రహిత జిల్లాగా మార్చేలా ప్రతీ ఒక్కరు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్ రజిత అన్నారు ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ముస్తాబాద్ మండలం పోతుగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో వైద్య సిబ్బంది నిర్వహించిన ర్యాలీని, డీఎంహెచ్‌వో డాక్టర్ రజిత జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ సూచన మేరకు మలేరియా అంతం చేద్దాం ఆరోగ్యమైన(సమాజాన్ని )నిర్మిద్దాం అనే నినాదం తో







మలేరియా నిర్మూలనకు అందరూ కృషి చేయాలన్నారు. గ్రామాలు, పట్టణాలలో ఎక్కడా నీటి నిల్వలు ఉండకుండా ప్రతీ శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బందికి సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వకుండా జాగ్రత్తలు పాటించాలని ప్రజలను కోరు . ఈ కార్యక్రమం లో పోతుగల్ గ్రామ సర్పంచ్ పెద్దిగారి యాదమ్మ,శ్రీనివాస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సంపత్, డాక్టర్ నహిమ, ప్రాథమిక కేంద్ర వైద్యాధికారులు డాక్టర్ ఆఫీ జ, డాక్టర్ గీతాంజలి, డిప్యూడెమో రాజ్ కుమార్ సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

## వర్షం నీరు వృధా కాకుండా కాపాడాలి

- బేరి రామచందర్ యాదవ్





శేరిలింగంపల్లి అక్షరం ప్రతినిధి ఏప్రిల్ 25: నేతాజీ నగర్ కాలనీలో ఐదు బోర్లు ఉపయోగంలో లేవు, రీఫిల్ బోర్వెల్ కోసం సిద్ధంగా ఉన్నాయి, వాటికి జిహెచ్ఎంసి తరఫున బోర్లు రీఫిల్ అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలి, భూగర్భ జలాలు పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్ కి వినతి పత్రం సమర్పించిన కాలనీ అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్. కాలనీలో ఖాళీ స్థలం ఉన్నచోట పార్కు, పాఠశాలలు ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవించుకున్నారు. నేతాజీ నగర్ కాలనీలో ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, భూగర్భ జలాలు పెరగాలంటే రాబోయే తరాలకు మనం నీరు అందించాలంటే తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు అవగాహన కలిగించాలి . సి.ఎం.సి. కమిషనర్, శేరిలింగంపల్లి జోన్ డిప్యూటీ కమిషనర్లందరికీ వారి వారి పరిధిలోని సంబంధిత ఆర్.డబ్ల్యూ.ఏ.లు స్థానిక ప్లంబర్లతో సమన్వయం చేసుకోమని ఆదేశించారు. ఈ సమావేశానికి ఎస్.ఈ.లు, ఈ.ఈ.లు సీనియర్ కీటక శాస్త్రవేత్తలు, నేతాజీ నగర్ కాలనీ ఉపాధ్యక్షులు రాయుడు, సెక్రటరీ మణికంఠ, గుల్మోహర్ పార్క్ కాలనీ ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ఉపాధ్యక్షులు మోహన్ రావు, ప్రభాకర్ చారి అన్ని కాలనీలా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కార్యదర్శులు హాజరైనారు.

## ఐరీష్ విధానం రద్దు చేసి పాత మస్టర్ పద్ధతిని అమలు చేయాలి



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ )ఏప్రిల్ 25:

ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం బలహీనపరుస్తుందని, ఉపాధి కూలీలకు ఐరిష్ విధానం రద్దు చేసి పాత 'మస్టర్' పద్ధతి అమలు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాపురం మహేందర్ డిమాండ్ చేశారు. మండలంలోని ఎల్లారెడ్డిగూడెంలో ఉపాధి హామీ పథకంలో కూలీలు చేస్తున్న ప్రదేశాన్ని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాపురం మహేందర్ శనివారం సందర్శించి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరుస్తూ నిరుపేద కార్మికుల జీవనాధారాన్ని దెబ్బతీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కూలీలకు ఐరీష్ విధానం రద్దు చేసి పాత మస్టర్ పద్ధతిని పునరుద్ధరించాలని, భూమి లేని పేదలకు సం వత్సరానికి రూ.12 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటమ్మ, నర్సమ్మ, కవిత, రాణి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

## ఎవరికి వారే జనగణలలో పాల్గొనవచ్చు

జ్యోతి నగర్ ఎన్టిపిసి ఏప్రిల్ 25 పెద్దపల్లి జిల్లా అక్షర న్యూస్

జన గణన -2027 లో భాగంగా ఆదివారం నుండి స్వీయ గణన కార్యక్రమం ఆరంభం అవుతుందని అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఉదయం 9.00 గంటలకు నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రారంభ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. స్వీయ గణన లో భాగంగా ప్రజలే తమ వివరాలను తామే నమోదు చేసుకునే సౌకర్యం ఆన్ లైన్ లో ఏప్రిల్ 26, 2026 నుండి మే 10 , 2026 వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. స్వీయ గణన చేసుకోవడానికి ముందుగా ఆన్లైన్ లో ట్ట్రజూం://ంవ.ఎవఅంబం.స్త్రశీజ.ఱఅ అనే లింక్ తెరిచి సెల్ఫ్ ఎన్యూమరేషన్ ( హెచ్ ఎల్ ఓ ) లాగిన్ వద్ద తెలంగాణ ఎంపిక చేసి, క్యాప్చ ఎంటర్ చేసి వెరిఫై ఁ ప్రొసీడ్ క్లిక్ చేస్తే వెల్ కమ్ పేజీ తెరుచుకుంటుందని అన్నారు. ఈ పేజీలో కుటుంబ పెద్ద పేరు, మొబైల్ నంబర్ నమోదు చేయాలని తెలిపారు. ఆ తరువాత వచ్చిన ఓ టి పి ఎంటర్ చేసి మళ్ళీ వెరిఫై ఁ ప్రొసీడ్ క్లిక్ చేయాలని తెలిపారు. ఆ తరువాత నచ్చిన భాష ను ఎంచుకొని జిల్లా, పట్టణం, పిన్ కోడ్ వివరాలు నమోదు చేయాలని కోరారు. మొబైల్ లో లొకేషన్ ఆన్ చేసి, ఎవరి ఇంటి వద్ద వారు రెడ్ మార్క్ సెట్ చేయాలని తెలిపారు. ఇళ్ల వివరాలకు సంబంధించిన 33 ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి, ప్రి వ్యూ ద్వారా చెక్ చేసి సబ్ మిట్ చేసిన తరువాత హెచ్ తో ప్రారంభమయ్యే 11 అంకెల సెల్ఫ్ ఎన్యూమరేషన్ ఐ డి నెంబర్ వస్తుందని తెలిపారు. దాన్ని స్క్రీన్‌షాట్ తీసుకొని లేదా నమోదు చేసుకుని భద్రపరిచి గణన అధికారి ఇంటికి వచ్చినప్పుడు చూపిస్తే వారు అప్రూవ్ చేస్తారని అన్నారు. అయితే ఒక కుటుంబానికి ఒకే మొబైల్ నంబర్ ఉపయోగించాలని తెలిపారు. దీంతో సమయం ఆదా అవుతుందని తెలిపారు. ఈ అవకాశాన్నిసద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఎన్.సి.డబ్ల్యూ.ఏ ఉద్యోగులకు క్వార్టర్ల కౌన్సెలింగ్ నిర్వహణ




మంచిర్యాల జిల్లా/మందమర్రి/ ఏప్రిల్ 25/అక్షరం న్యూస్ -:

మందమర్రి ఏరియాకు చెందిన ఎన్.సి.డబ్ల్యూ.ఏ (ఎన్.సి.డబ్ల్యూ.ఏ ) ఉద్యోగులకు శనివారం సి.ఈ.ఆర్ క్లబ్ లో సీనియారిటీ ప్రాతిపదికన క్వార్టర్ల కేటాయింపు కౌన్సెలింగ్‌ను నిర్వహించారు. మొత్తం 93 క్వార్టర్లు అందుబాటులో ఉండగా వాటి కోసం 158 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. నిబంధనల ప్రకారం సీనియారిటీ ప్రాతిపదికన పారదర్శకమైన పద్ధతిలో కౌన్సెలింగ్ నిర్వహించి 19 మంది అర్హులైన ఉద్యోగులకు క్వార్టర్లను కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ కౌన్సెలింగ్ ప్రక్రియలో డి.జి.ఎం (ఐ.ఈ.డి) కిరణ్ కుమార్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కార్తీక్, మరియు మేనేజ్మెంట్ ట్రైనీ (సివిల్) ఆర్. వీణ పాల్గొని కేటాయింపు ప్రక్రియను పర్యవేక్షించారు.

## సమస్యలు పరిష్కారమే మా ధ్యేయం ..

- సర్పంచ్ భూక్యా కాళోజీ
- తెలగవరం గ్రామంలో సర్పంచ్ భూక్యా కాళోజీ విస్తృత పర్యటన. ..




ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 25 తల్లాడ (అక్షరం న్యూస్)

తల్లాడ మండలం తెలగవరం గ్రామపంచాయతీ నందు శనివారం గ్రామ సర్పంచ్ భూక్యా కాళోజీ గ్రామంలో ప్రతి సంవత్సరం అడిగి తెలుసుకుంటూ.. సమస్యలు పరిష్కారం ధ్యేయంగా గ్రామ లో ఉన్న సమస్యలపై ఆరాతీస్తూ సర్పంచ్ కోళోజి మాట్లాడుతూ తెలగవరం గ్రామపంచాయతీ నందు సిసి రోడ్లు, మంచినీటి సరఫరా మరియు పారిశుద్ధ్యం, పర్యావరణం అనేక మౌలిక సదుపాయాలతో తెలగవరం గ్రామపంచాయతీ పాలకవర్గం మంచిగా పనిచేస్తుందని తెలిపారు.తెలగవరం గ్రామపంచాయతీ లో ప్రతి ఒక్కరూ గ్రామ అభివృద్ధి విషయంలో భాగస్వామ్యం కావాలని పంచాయతీ పరిధిలో ఎటువంటి సమస్యలుఉన్న తెలియజేస్తే ఆ సమస్యని వెంటనే పరిష్కరిస్తామని ఈ ఐదు సంవత్సరాలలో తెలగవరం గ్రామపంచాయతీని బాగా అభివృద్ధి పరుస్తానని ఈ మార్నింగ్ వాక్ ద్వారా సర్పంచ్ భూక్యా కాళోజీ తెలియజేశారు. ఈ గ్రామలో ఉన్న సమస్యలపై సర్పంచ్ అధికారులతో తెలగవరం గ్రామ ప్రజలతో తెలగవరం అభివృద్ధి గురించి,

# ప్రజా దర్బార్ లో వచ్చిన ప్రతి న్యాయబద్ధమైన సమస్యను పరిష్కరిస్తాం ..

- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ అజెండా ..
- భద్రత, భరోసా కల్పనపై దృష్టి
- ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు స్వీకరించడం మంచి పరిపాలనకు నిదర్శనం..
- ప్రతి క్లస్టర్‌లో ప్రజా దర్బార్ ద్వారా ప్రజల సమస్యలపై ప్రత్యక్ష అవగాహన..
- తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 25 (అక్షరం న్యూస్)

ప్రజా దర్బార్‌లో వచ్చిన ప్రతి న్యాయబద్ధమైన సమస్యను గరిష్ఠంగా మూడు నెలలలోపు




పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రివర్యులు పొంగులేటి



శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో సిపి



సునీల్ దత్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి.శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి మంత్రి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమానికి భద్రత, భరోసా కల్పించడమే అజెండాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. అభివృద్ధిని ఎక్కడా చిన్న చూపు చూడకుండా పెండింగ్ పనులను పూర్తి చేస్తూ, గత ప్రభుత్వం అమలు చేసిన మంచి కార్యక్రమాలను కొనసాగిస్తూ ఎన్నికల హామీలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. పేద ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్ల లోనే అధికారులను ప్రజల వద్దకు పంపి ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించి సంక్షేమ కార్యక్రమాలు అందించామని మంత్రి తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రతి వారం ఒక శాఖ ఆధ్వర్యంలో గ్రామాల నుంచి వచ్చిన స వ ు స్ య ల న ు పరిష్కరిస్తూ ప్రజలకు మేలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.పాలేరు నియోజకవర్గంలో ప్రతి మండలాన్ని మూడు క్లస్టర్లుగా విభజించి, ప్రతి క్లస్టర్ పరిధిలోనీ గ్రామ పంచాయతీలలో ప్రజా దర్బార్ నిర్వహిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు. ప్రజా దర్బార్‌లో వచ్చిన ప్రతి న్యాయబద్ధమైన దరఖాస్తును గరిష్ఠంగా మూడు నెలల్లో పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.నేలకొండపల్లి మండలంలో వచ్చిన దరఖాస్తుల్లో దాదాపు 55 శాతం ఇందిరమ్మ ఇండ్ల కోసం వచ్చినవేనని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి, నిర్మాణ పురోగతి ఆధారంగా నిధులు విడుదల చేయడంతో ప్రజల్లో విశ్వాసం పెరిగిందని పేర్కొన్నారు. మే నెలలో రెండవ విడత, తదుపరి విడతల్లో కూడా అర్హులైన పేదలకు ఇండ్లు అందిస్తామని తెలిపారు. ధరణి కారణంగా ఏర్పడిన భూ సమస్యలను భూభారతి ద్వారా పరిష్కరించే ప్రయత్నం జరుగు తోందని, సాదా బైనమా దరఖాస్తులను పరిష్కరిస్తామని మంత్రి

తెలిపారు.ఆసరా పెన్షన్, రేషన్ కార్డులు, రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యలపై వచ్చిన దరఖాస్తులను క్రమపద్ధతిలో పరిష్కరిస్తామని తెలిపారు.ప్రజలు తొందరపడకుండా ప్రశాంతంగా దరఖాస్తులు సమర్పించాలని, ప్రతి ఒక్కరి





దరఖాస్తును స్వీకరించి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు. సుబ్లేడు గ్రామానికి నూతన పోలీస్ స్టేషన్ మంజూరుకు




ప్రభుత్వ అనుమతి తీసుకొని త్వరలోనే శంకుస్థాపన



చేస్తామని తెలిపారు. ఖమ్మం పోలీస్ కమీషనర్



సునీల్ దత్ మాట్లాడుతూలి ప్రజాదర్బార్ కార్యక్రమం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న ముఖ్యమైన కార్యక్రమమని తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రజల వద్దకే వచ్చి




సమస్యలు స్వీకరిస్తున్నారని చెప్పారు. కొన్ని సమస్యలు వెంటనే, మరి కొన్ని కొంత సమయం తీసుకున్నప్పటికీ ప్రతి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమం ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు.కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూలి ఉదయం నేలకొండపల్లి మండలంలో ప్రజా దర్బార్ విజయవంతంగా నిర్వహించామని, ప్రస్తుతం తిరుమలాయ పాలెం మండలంలో కొనసాగుతోందని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారం మంచి పరిపాలనకు సూచిక అని పేర్కొన్నారు. ప్రతి అర్జీపై ఫాలోఅప్ చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్, మండల ప్రత్యేక అధికారి, వివిధ శాఖల ఉన్నతాధికారుకు, జిల్లా అధికారులు, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్, ఎంపీడీఓ, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టిపిసి ఏ జిఎం సాగర్ రంజన్ సాహూకు సత్కారం!!

- సంస్థ అభివృద్ధిపై చర్చలతో కూడిన ఆత్మీయ సమావేశం
- పుష్పగుచ్ఛం అందజేసిన బీజేపీ నేత కందుల సంధ్యారాణి



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఏప్రిల్ 25 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ఎన్టిపిసి సంస్థలో హెచ్ఆర్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్గా విధులు నిర్వహిస్తున్న సాగర్ రంజన్ సాహూని శుక్రవారం తన కార్యాలయంలో బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణి మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది. ఈ సమావేశంలో సంస్థ అభివృద్ధి, ఉద్యోగుల సంక్షేమం వంటి అంశాలపై చర్చలు జరిగినట్లు సమాచారం. అందరూ కలిసి సాగర్ రంజన్ సాహూ సేవలను కొనియాడారు. ఆయన నాయకత్వంలో సంస్థ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమం ముగింపులో పరస్పరం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సత్కారం స్థానికంగా ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో బిఎంఎస్ నాయకులు సాగర్ రాజు, సత్యనారాయణ రెడ్డి, బాలయ్య, బీజేపీ నాయకులు జక్కుల పద్మ, ప్రవీణ్ పాల్గొన్నారు.

## స్వీయ గణన సదుపాయం వినియోగించాలి.....

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- 2027 జన గణనలో భాగంగా
- ఇండ్ల జాబితా తయారీకి పకడ్బందీ చర్యలు.
- ఆన్లైన్ స్వీయ గణనకు ప్రత్యేక వెబ్సైట్ వినియోగించాలని సూచన..



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 25 (అక్షరం న్యూస్)

జనగణన--2027లో భాగంగా స్వీయ గణన సదుపాయం వినియోగించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.జన గణన 2027 మొదటి దశ ప్రక్రియ అయిన ఇండ్ల జాబితా తయారీ కార్యక్రమం 2026 మే 11 నుండి జూన్ 9 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ గణనలో భాగంగా మొట్టమొదటిసారిగా స్వీయ గణన (ావశ్రీట-జుఅబఎవతీ్ఖఅశీఅ) సదుపాయాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకు వచ్చిందని, ఈ సదుపాయం 2026 ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు 15 రోజుల పాటు ష్ట్రిజూం://ఒవ.ఎవఅంబం.స్త్రశీజ.ఱఅ వెబ్సైట్లో అందుబాటులో ఉంటుందని తెలిపారు.జిల్లా ప్రజలు తమ మొబైల్ నెంబర్తో పోర్టల్లో లాగిన్ అయి, తమ గృహాన్ని జియో-ట్యాగ్ చేసి అవసరమైన వివరాలను నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. నమోదు ప్రక్రియ పూర్తయిన తర్వాత "న" అక్షరంతో ప్రారంభమయ్యే 11 అంకెల ావశ్రీట-జుఅబఎవతీ్ఖఅశీఅ ×ఱ (ాజు ×ఱ) జనరేట్ అవుతుందని తెలిపారు.ఈ ాజు ×ఱను ఫీల్డ్ వెరిఫికేషన్ కోసం ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్కు అందజేస్తే గణన ప్రక్రియ వేగవంతంగా పూర్తవుతుందని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు అందరూ ఈ స్వీయ గణన సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆ ప్రకటనలో కోరారు.

## వడదెబ్బతో మృతి చెందిన లింగంపెల్లి నాగరాజు కుటుంబానికి 50 కిలోల బియ్యం వితరణ

- కాట్నపల్లి వార్డ్ మెంబర్ కట్టెకోల తార లక్ష్మణ్ అందచేత



చొప్పదండి /కరీంనగర్,ఏప్రిల్ 25 (అక్షరం న్యూస్ )

చొప్పదండి మండలం లోని కట్నపల్లి గ్రామానికి చెందిన లింగంపెల్లి నాగరాజు వడదెబ్బతో మృతి చెందగా, వారి కుటుంబానికి కట్నపల్లి మాజీ ఎంపీటీసీ, ప్రస్తుత వార్డ్ మెంబర్ కట్టెకోల తార లక్ష్మణ్ శనివారం రోజున తనవంతు సాయంగా 50 కిలోల బియ్యం, ఆర్థిక సహాయం చేసినాడు.మానవ దృక్పథాలతో మనిషికి తలో చెయ్ వేసి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ ఈ ఇటీవల నమోదైన అధిక ఉష్ణోగ్రతల కారణంగా లింగంపెల్లి నాగరాజు వడదెబ్బకు గురై మృతి చెందాడు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉంది. విషయం తెలుసుకున్న కాట్నపల్లి మాజీ ఎంపీటీసీ కట్టెకోల తార లక్ష్మణ్ మానవతా దృక్పథంతో స్పందించారు. ఈ సందర్భంగా తార లక్ష్మణ్ మాట్లాడుతూ.. నాగరాజు కుటుంబానికి తమవంతు సాయంగా ఈ బియ్యం ఇస్తున్నామని, ఈ కుటుంబం ఆర్థికంగ వెనుక బడిన కుటుంబం అని ఎవరైనా దాతలు ముందుకొచ్చి ఆ కుటుంబం ను ఆదుకోవాలని భవిష్యత్తులో కూడా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం కూడా స్పందించి వడదెబ్బ మృతుల కుటుంబాలకు ఎక్స్గ్రేషియా అందించాలని వార్డ్ మెంబర్ కట్టెకోల తార లక్ష్మణ్ కోరారు.

# గురుకులాల ప్రగతిలో గురువుల పాత్ర అమోఘం..

- క్రమశిక్షణే ఆభరణం - విజయమే గమ్యం
- స్వేరో జిల్లా అధ్యక్షులు తగరం శ్రీకాంత్ స్వేరో
- గురుకుల విద్యార్థులకు స్వేరో నెట్వర్క్ ఘన వీడ్కోలు..
- సెలవుల్లోనూ 'లక్ష్యం' వీడొద్దు





ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 25 (అక్షరం న్యూస్)

గురుకులాల ప్రగతిలో గురువుల పాత్ర అమోఘం అని, ఖమ్మం జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో విద్యా సంవత్సరాన్ని అత్యంత క్రమశిక్షణతో, ఉత్తమ ఫలితాలతో పూర్తి చేసుకున్న విద్యార్థినీ విద్యార్థులకు స్వేరో జిల్లా అధ్యక్షులు తగరం శ్రీకాంత్ స్వేరో శనివారం ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు తగరం శ్రీకాంత్ స్వేరో మాట్లాడుతూ.. విద్యార్థులను కేవలం పాఠాలకే పరిమితం చేయకుండా, వారిని బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దుతున్న జోనల్ ఆఫీసర్ అలివేలు, వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్కు, అహర్నిశలు శ్రమిస్తున్న ఉపాధ్యాయ బృందానికి, సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నాణ్యమైన విద్యతో పాటు, విద్యార్థుల ఆరోగ్య సంరక్షణలో వారు చూపిస్తున్న చొరవ అభినందనీయమని కొనియాడారు.

**సెలవుల్లోనూ 'లక్ష్యం' వీడొద్దు :**

?వేసవి సెలవుల కోసం ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా, తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే కొత్త నైపుణ్యాలను పెంపొందించుకోవాలని స్వేరో నెట్వర్క్ ఆకాంక్షిస్తుందన్నారు. సెలవుల్లో పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారి బంగారు భవిష్యత్తుకు పునాది వేసేలా సముచిత మార్గదర్శకత్వం అందించాలని కోరారు. కొత్త లక్ష్యాలతో, రెట్టింపు ఉత్సాహంతో తదుపరి విద్యా సంవత్సరానికి సిద్ధం కావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ?ఈ సందర్భంగా స్వేరో జిల్లా కమిటీ తరుపున విద్యార్థులందరికీ ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షించారు.

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అవగాహన కార్యక్రమాలు..

ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 25 (అక్షరం న్యూస్)

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం మెరుగైన సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు మరియు వానాకాలం సాగుకు రైతులను సమాయత్తం చేసేందుకు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా 27 ఏప్రిల్ నుండి మే 23, 2026 వరకు నాలుగు వారాలపాటు అవగాహన కార్యక్రమాలను నిర్వహించనుంది. వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని అశ్వరావుపేట వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు తొమ్మిది బృందాలుగా ఏర్పడి నాలుగు వారాల పాటు అశ్వరావుపేట, దమ్మపేట, సత్తుపల్లి, వేంసూరు, ములకలపల్లి, కల్లూరు, తల్లాడ, బూర్గంపాడు, గుండాల, చండ్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, అల్లపల్లి, పెనుబల్లి, దుమ్మగూడెం, టేకులపల్లి, జూలూరుపాడు, సుజాతనగర్, చర్ల, కరకగ్గూడెం, ఇల్లందు, పాల్వంచ, పినపాక, అశ్వాపురం, చుంచుపల్లి, మణుగూరు మండలాల్లోని 72 గ్రామాలలో వ్యవసాయ మరియు అనుబంధ అధికారుల సమన్వయంతో నిర్వహించడం జరుగుతుంది. ఈ బృందాలలో ఇద్దరు వ్యవసాయ శాస్త్రవేత్తలు వ్యవసాయ అధికారులతో పాటు వ్యవసాయ విద్యార్థులు కూడా పాల్గొని రైతు సోదరులకు ఆరు అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుంది. ముఖ్యంగా ఈ అవగాహన కార్యక్రమంలో భాగంగా మోతాదుకు మించి యూరియా వాడకాన్ని నివారించడం, పురుగు మందుల మోతాదుకు మించి వాడకాన్ని నివారించడం, పంట మార్పిడి, మార్కెట్ డిమాండ్ ఆధారంగా వరి రకాల, సాగు నీటి వినియోగాన్ని తగ్గించడానికి నీటి ఆదా పద్ధతులు, సేంద్రియ పద్ధతులు లాంటి అంశాలపై శాస్త్రవేత్తలు మరియు అధికారులు రైతులకు సూచనలు ఇస్తారు. అదేవిధంగా ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు అవసరమైన సలహాలు సూచనలు ఇవ్వడంతో పాటు వ్యవసాయ మరియు అనుబంధ రంగాలపై దృష్టిని సారించి లాభాల బాట లో పయనించేలా వారిని చైతన్య పరుస్తారు. ప్రస్తుతం రైతుల ముంగిట్లోకి శాస్త్రవేత్తలను తీసుకురావడం వల్ల రైతుల సాంకేతిక సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ప్రభుత్వం భావించి ఈ వినూత్న పద్ధతిలో అవగాహన కార్యక్రమాలను చేపట్టనుంది. ఈ పర్యటనల ద్వారా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు స్వయంగా రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందిస్తారు. దీనికి సంబంధించిన బృందాలు గ్రామాలలో పర్యటిస్తున్నప్పుడు రైతు సోదరులు అధిక సంఖ్య లో ఈ అవగాహన కార్యక్రమాలలో పాల్గొని విజయవంతం చేయాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత కుమార్ విజ్ఞప్తి చేశారు.

### 90 వేల మెగావాట్ల దిశగా వేగంగా ఎన్టిపిసి...

# ఖవదా-II సౌర ప్రాజెక్ట్తో కొత్త మైలురాయి

జ్యోతి నగర్ ఎన్టిపిసి ఏప్రిల్ 25 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

దేశంలో అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి సంస్థలలో ఒకటైన ఎన్టిపిసి లిమిటెడ్ మరో కీలక మైలురాయిని అందుకుంది. గుజరాత్లోని ఖవదా-×× సోలార్ పీవీ ప్రాజెక్టులో 90 మెగావాట్ల యూనిట్కు వాణిజ్య కార్యకలాపాల ప్రారంభ తేదీ (జూఱ) ప్రకటించడంతో, సంస్థ మొత్తం స్థాపిత సామర్థ్యం 89,705 మెగావాట్లకు పెరిగింది. వాణిజ్యపరంగా పనిచేస్తున్న సామర్థ్యం 88,625 మెగావాట్లుగా ఉంది.ఈ 90 మెగావాట్ల సామర్థ్యం, మొత్తం 1,200 మెగావాట్ల ఖవదా-×× ప్రాజెక్ట్లో ఏడవ దశగా ప్రారంభమైంది. ఈ ప్రాజెక్టును ఎన్టీపీసీ అనుబంధ సంస్థ ఎన్టిపిసి గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ద్వారా అమలు చేస్తున్నారు. ఏప్రిల్ 25 నుంచి ఈ యూనిట్ పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించనుంది.80 వేల నుంచి 90 వేల మెగావాట్ల దాకా వేగవంతమైన ప్రయాణంఎన్టీపీసీ సామర్థ్య విస్తరణను పరిశీలిస్తే, సంస్థ అభివృద్ధి వేగం స్పష్టంగా కనిపిస్తుంది:80,000 మెగావాట్ల మైలురాయి: సుమారు 2023 చివరి - - 2024 ప్రారంభంలో చేరుకుంది.ప్రస్తుతం (2026 ఏప్రిల్): 89,7000 మెగావాట్లు90,000 మెగావాట్ల లక్ష్యం: అతి తక్కువ కాలంలోనే చేరుకోబోతోంది అంటే, కేవలం 2--3 సంవత్సరాల్లోనే 10,000 మెగావాట్ల పెరుగుదల సాధించడం విశేషం. ముఖ్యంగా పునరుత్పాదక శక్తి (సోలార్, విండ్) రంగంలో వేగవంతమైన పెట్టుబడులు ఈ వృద్ధికి ప్రధాన కారణంగా నిలిచాయి.







పునరుత్పాదక శక్తిలో దూసుకెళ్తున్న ఎన్టీపీసీఖవదా వంటి భారీ సోలార్ ప్రాజెక్టులు, ఎన్టీపీసీని సంప్రదాయ థర్మల్ పవర్ సంస్థ నుంచి గ్రీన్ ఎనర్జీ లీడర్గా మార్చుతున్నాయి. కంపెనీ లక్ష్యం:2032 నాటికి భారీగా పునరుత్పాదక శక్తి సామర్థ్యం పెంపుకార్బన్ ఉద్గారాల తగ్గింపుదేశ విద్యుత్ అవసరాలకు శాశ్వత పరిష్కారంఎన్టీపీసీ 90 గిగావాట్ల దిశగా చేరువ కావడం, భారత విద్యుత్ రంగంలో ఒక ముఖ్యమైన మలుపు. ముఖ్యంగా:భారీ స్థాయిలో సోలార్ ప్రాజెక్టుల విస్తరణఅనుబంధ సంస్థల ద్వారా వేగవంతమైన అమలుగ్రీన్ ఎనర్జీపై స్పష్టమైన దృష్టిఇవి సంస్థను భవిష్యత్తులో 100 గిగావాట్ల లక్ష్యం వైపు తీసుకెళ్తాయని నిపుణులు భావిస్తున్నారు.ఖవదా-×× ప్రాజెక్టులో 90 మెగావాట్ల కమర్షియల్ ఆపరేషన్ డిక్లేర్ తో ఎన్టీపీసీ మరో అడుగు ముందుకు వేసింది. 80 వేల నుంచి 90 వేల మెగావాట్లకు చేరువ కావడం సంస్థ వేగవంతమైన అభివృద్ధికి నిదర్శనం. దేశంలో విద్యుత్ రంగంలో ఎన్టీపీసీ ప్రాభవం మరింత బలపడుతోంది.

## కార్మిక ఐక్యతకు దక్కిన అద్భుత విజయం

- హక్కుల కోసం సాగిన పోరాటం వృథా కాలేదు
- హామీల అమలులో ప్రభుత్వం జాప్యం చేయొద్దు
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా /25 ఏప్రిల్ /అక్షరం న్యూస్: కార్మిక ఐక్యతకు దక్కిన అద్భుత విజయమని, సమ్మె ద్వారా కార్మికులు తమ సత్తా చాటారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా అన్నారు. ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె విరమణ సందర్భంగా శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. హక్కుల కోసం సాగిన వీరోచిత పోరాటం వృథా కాలేదని, కార్మికుల ఐక్యమత్యం ముందు ప్రభుత్వం దిగిరాక తప్పలేదని పేర్కొన్నారు. మూడు రోజుల పాటు కుటుంబాలను వదిలి రోడ్లపై పోరాడిన కార్మికుల పట్టుదల వల్లే ఈ విజయం సాధ్యమైందని కొనియాడారు. చర్చల సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా, తక్షణమే క్షేత్రస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, వారి శ్రేయస్సు కోసం ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టాలని, సమస్యలు మళ్ళీ తలెత్తకుండా శాశ్వత మార్గాలను అన్వేషించాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు.



# త్రాగునీటి సరఫరా పై హెల్ప్ లైన్లు ఏర్పాటు చేయాలి..

- క్షేత్రస్థాయిలో పర్యవేక్షణతో నిరంతర నీటి సరఫరా నిర్ధారించాలి.
- నాలుగు రోజుల్లో పెండింగ్ త్రాగునీటి సమస్యల పరిష్కరించాలి -- జిల్లా కలెక్టర్ అంకిత్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/25 ఏప్రిల్/ అక్షరం న్యూస్:

వేసవికాలంలో త్రాగునీటి కొరత సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టి, జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో హెల్ప్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీ కార్యాలయం నుండి నిర్వహించిన జూమ్ సమావేశం ద్వారా భద్రాచలం పి.ఓ రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ శాఖ అధికారులతో కలెక్టర్ వేసవిలో త్రాగునీటి సరఫరాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయిలో త్రాగునీటి సరఫరా పర్యవేక్షణ బాధ్యత ఎంపీడీవోలదేనని స్పష్టం చేశారు. మిషన్ భగీరథ అధికారులు, ఎంపీడీవోలు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రతి గ్రామానికి నిరంతర నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యటించి త్రాగునీటి సరఫరాలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నీటి ఎద్దడి ఎక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, నీటి వనరులు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రతి మండలం, గ్రామంలో బోర్‌వెల్లు, చేతి పంపులు వంటి ప్రత్యామ్నాయ వనరులను ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలని, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే చేపట్టాలని స్పష్టం చేశారు. మోటార్లలో లోపాలు తలెత్తినపుడు తక్షణమే మరమ్మతులు చేయడానికి అదనపు మోటార్లు, జనరేటర్లు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. త్రాగునీటి సరఫరా పరిస్థితిపై ప్రతిరోజూ నివేదికలు సమర్పించాలని అధికారులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఎంపీడీవో, ఎంఆర్ఓ కార్యాలయాల్లో హెల్ప్‌లైన్ నంబర్లను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని, గ్రామాల్లో చివరి దూర ప్రాంతాలకు కూడా ఎటువంటి అంతరాయం లేకుండా నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమస్య తలెత్తిన వెంటనే గరిష్టంగా 24 గంటల్లోపు పరిష్కరించాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు ప్రతి వార్డులో ఉదయం నీటి సరఫరా సమయంలో క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించి, ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం మండలాల వారీగా త్రాగునీటి సమస్యలపై సమగ్ర సమీక్ష నిర్వహించిన కలెక్టర్, ముఖ్యంగా చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో గుత్తికొయ హ్యాబిటేషన్లలో సమస్యలు అధికంగా ఉన్నాయని గుర్తించి, వాటికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాల్వంచలో 55, చర్లలో 54, దుమ్ముగూడెంలో 55 త్రాగునీటి సమస్యలు ఉన్నప్పటికీ, ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగమైన 99 రోజుల కార్యాచరణలో వాటిని ఎందుకు పరిష్కరించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవోలు మండల స్థాయిలో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారా? ఇంకా పనులు పెండింగ్‌లో ఎందుకు ఉన్నాయని ప్రశ్నించారు. నిర్లక్ష్యం సహించబోదని స్పష్టం చేస్తూ, నాలుగు రోజుల్లోపే అన్ని త్రాగునీటి సమస్యలను పరిష్కరించాలని గట్టిగా ఆదేశించారు. రానున్న మూడు నెలలు అత్యంత కీలకమని , ఎక్కడా నీటి ఎద్దడి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న త్రాగునీటి సమస్యలపై సమగ్ర నివేదికలు సమర్పించి, తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## తాగునీటి ఎద్దడిపై సత్వరమే స్పందించాలి

- యుద్ధప్రాతిపదికన పైపులైన్ల మరమ్మతులు చేపట్టాలి
- ప్రతి ఇంటికీ భగీరథ నీరు చేరాల్సిందే
- బోర్ల పునరుద్ధరణకు తక్షణ చర్యలు తీసుకోవాలి
- నీటి పథకాల నిర్మాణాల్లో జాప్యం సహించం
- ప్రజల గొంతు ఎండకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- వేసవి కార్యాచరణ ప్రణాళిక పక్కాగా అమలు కావాలి ఫిర్యాదులు వస్తే తక్షణమే స్పందించేలా వ్యవస్థ ఉండాలి
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు
- త్రాగునీరు సమస్యపై అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా /25 ఏప్రిల్/ అక్షరం న్యూస్ : వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు సత్వరమే స్పందించి పరిస్కారానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు ఆదేశించారు. శనివారం స్థానిక సింగరేణి అతిథిగృహంలో మిషన్ భగీరథ, కొత్తగూడెం కార్పొరేషన్, పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడైనా బోర్ల మరమ్మతులు ఉంటే తక్షణమే పూర్తి చేయాలని, అవసరమైన చోట కొత్త బోర్లు వేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. నీటి సరఫరాలో అంతరాయం కలిగించే పైప్‌లైన్ లీకేజీలను యుద్ధప్రాతిపదికన అరికట్టాలని, కొత్త పైప్‌లైన్ల ఏర్పాటు పనుల్లో వేగం పెంచాలని స్పష్టం చేశారు. కొనసాగుతున్న నీటి పథకాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. మిషన్ భగీరథ నీరు ప్రతి చివరి ఇంటికీ అందేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఉండాలని, నీటి సమస్యపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పట్ల తక్షణమే స్పందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. తాగునీటి సరఫరా విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. సమీక్షా సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రాజకీయాలకు అతీతంగా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు...

- రాయిగూడెం 'ప్రజా దర్బార్'లో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడి..
- న్యాయమైన సమస్య అయితే పరిష్కరించే బాధ్యత తనదేనని హామీ..



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 25 (అక్షరం న్యూస్)

నేలకొండపల్లి (రాయిగూడెం) : ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదన్నదే ఈ ప్రజా ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పాలేరు నియోజకవర్గంలో వినూత్నంగా చేపట్టిన 'ప్రజా దర్బార్' కార్యక్రమాన్ని శనివారం రాయిగూడెం క్లస్టర్ పరిధిలో నిర్వహించారు. రాయిగూడెం, అజయ్‌తండా, చెరువుమాదారం, మంగాపురం తండా, అప్పలనరసింహపురం, బుద్ధారం, కట్టుకాచారం, కొంగర, రాజారాంపేట, భైరవునిపల్లి గ్రామ పంచాయతీలకు చెందిన ప్రజలతో మంత్రి పొంగులేటి ముఖాముఖి భేటీ అయ్యారు.

### పారదర్శక పాలన - ప్రజల ముంగిటకే యంత్రాంగం..

గతంలో ప్రజలు తమ గోడు చెప్పుకోవడానికి సరైన వేదిక లేక ఇబ్బందులు పడ్డారని, కానీ నేడు అధికారులే ప్రజల వద్దకు వచ్చి సమస్యలు వింటున్నారని మంత్రి తెలిపారు. "ఇది కేవలం ఒక రోజు కార్యక్రమం కాదు, నిరంతరం జరిగే ప్రక్రియ. మీ కష్టాలను వినే చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి ఉంది కాబట్టే ధైర్యంగా మీ మధ్యకు రాగలుగుతున్నాం" అని ఆయన పేర్కొన్నారు.

### క్లస్టర్ల వారీగా.. క్షుణ్ణంగా పరిష్కారం..

ప్రజా దర్బార్‌ను కేవలం సభలా కాకుండా, ప్రతి పంచాయతీకి ఒక క్లాస్‌రూమ్ కేటాయించి అధికారులను కూర్చోబెట్టడం ద్వారా సమస్యలను లోతుగా అధ్యయనం చేస్తున్నామని చెప్పారు. స్పాట్‌లోనే పరిష్కరించే వీలున్న సమస్యలను వెంటనే తేల్చేయాలని, మిగిలిన వాటికి వారం, నెల, మూడు నెలల చొప్పున గడువు నిర్ణయించి





పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

### రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి..

"రాజకీయాలు ఎన్నికల వరకే. గెలిచిన తర్వాత ప్రభుత్వం అందరిది. అడిగిన పని న్యాయమైనదైతే, ప్రజలకు ఉపయోగపడేదైతే తప్పకుండా పూర్తి చేస్తాం" అని మంత్రి వివరించారు. ఈ నియోజకవర్గంలో చేస్తున్న ఈ ప్రయోగం రేపు రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో అమలు చేయడానికి ఒక నమూనాగా నిలుస్తుందని ఆకాంక్షించారు.

### శాఖల వారీగా సమీక్షలు..

ఈనెల 27వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ, హౌసింగ్ శాఖలపై కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమీక్షలు నిర్వహించనున్నట్లు మంత్రి ప్రకటించారు. ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి సమస్యలను పారదర్శకంగా, వడివడిగా పరిష్కరించి ప్రజలకు మేలు చేకూరుస్తామని హామీ ఇచ్చారు.

ప్రజల ఆశీస్సులే నా బలం..

"మీరు మనస్ఫూర్తిగా ఆశీర్వదించి నన్ను గెలిపించారు. మీ ఇంటి పెద్ద కొడుకుగా మీ కష్టాలను తీర్చాల్సిన బాధ్యత నాపై ఉంది. అసాధ్యమైన హామీలు నేను ఇవ్వను కానీ.. మీరు అడిగే సమస్య న్యాయమైనదైతే దాన్ని పూర్తి చేసే బాధ్యత నాది" అని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు.



# అనారోగ్య బాధితులకు అండగా నిలుస్తున్న.. ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

- పాముకాటు బాధితునికి రూ.2 లక్షల ఎల్ ఓసీ మంజూరు..

ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 25 (అక్షరం న్యూస్)

అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజల ఆరోగ్యం, సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మరోసారి తన సేవాభావాన్ని చాటుకున్నారు. అనారోగ్యంతో





బాధపడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య సహాయం అందించడంలో ఆయన ముందుంటూ, అవసరమైన సమయంలో ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తన నియోజకవర్గ ప్రజలను ఎమ్మెల్యే స్వయంగా పరామర్శించారు. అశ్వారావుపేట మండలం ఆసుపాక గ్రామానికి చెందిన బోడా రవి, దమ్మపేట మండలం పెద్దగొల్లగూడెం గ్రామానికి చెందిన రాజిని సూరమ్మ, చంద్రుగొండ మండలం గుర్రంగూడెం గ్రామానికి చెందిన పద్దం సులోచన వంటి బాధితులు తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతూ నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. వీరికి ఎమ్మెల్యే సిఫారసుతో ఎల్‌ఓసి మంజూరు చేయించగా, ప్రస్తుతం ఉచిత వైద్య సేవలు అందుతున్నాయి. వారిని పరామర్శించిన ఎమ్మెల్యే వారి ఆరోగ్య పరిస్థితిని వివరంగా అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి చికిత్స విధానంపై ఆరా తీశారు. రోగులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తనను సంప్రదించాలని సూచించారు. ఇదే సందర్భంగా చంద్రుగొండ మండలం దామరచర్ల గ్రామానికి చెందిన గౌర పెద్దిరాజు పాముకాటుకు గురై అత్యవసర పరిస్థితిలో చికిత్స పొందుతుండగా, ఆయనకు తక్షణ సహాయం అందేలా ఎమ్మెల్యే చర్యలు తీసుకున్నారు. బాధితుని పరిస్థితిని తెలుసుకున్న వెంటనే రూ. 2,00,000 విలువైన ఎల్‌ఓసిని మంజూరు చేయించి, స్వయంగా అందజేశారు. మెరుగైన వైద్యం అందించాల్సిందిగా సంబంధిత వైద్య సిబ్బందికి సూచనలు ఇచ్చారు.





ప్రజల ప్రాణాలు కాపాడడం ప్రభుత్వానికి ముఖ్య బాధ్యత అని పేర్కొన్న ఎమ్మెల్యే, ఎవరైనా ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్యానికి దూరం కావద్దని అన్నారు. ప్రభుత్వ పథకాలు, ఎల్‌ఓసిలను సద్వినియోగం చేసుకొని ప్రజలు మెరుగైన వైద్యం పొందాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఈ సేవా కార్యక్రమాలను నియోజకవర్గ ప్రజలు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అనుచరులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సానుకూల స్పందన హర్షణీయం

- ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం సాధ్యం
- ప్రభుత్వ హామీలను వెంటనే అమలు చేయాలి
- కార్మికుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా /25 ఏప్రిల్ /అక్షరం న్యూస్ :
ఆర్టీసీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం హర్షణీయమని, ఐక్య పోరాటాల ద్వారానే హక్కులను సాధించుకోవచ్చని కార్మికుల సమ్మెపోరాటం మరోసారి రుజువుచేసిందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం కార్మికులు చేపట్టిన సమ్మె విరమణ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడారు. చర్చల ద్వారా సమస్యలు పరిష్కారం కావడం శుభపరిణామమని, భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితులు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చడంలో పాలకులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని, సమ్మె కాలంలో కార్మికులు ప్రదర్శించిన ఐక్యత స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కేవలం తాత్కాలికంగా హామీలు ఇచ్చి చేతులు దులుపుకోకుండా, ఇచ్చిన ప్రతి మాటను గెజిట్ రూపంలోకి మార్చి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలను వీడి, వారి సంక్షేమానికి పెద్దపీట వేసినప్పుడే వ్యవస్థలు బలోపేతం అవుతాయని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎందుకు బ్లాక్ లిస్టులో పెట్టారో చెప్పాలి ఏపీఎం ను నిలదీసిన రైతులు



ఓదెల/పెద్దపల్లి ఏప్రిల్ 25(అక్షరం న్యూస్)
వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎందుకు బ్లాక్ లిస్టులో పెట్టారు అని మహిళా సంఘాల నాయకులతో పాటు రైతులు ఏపీను నిలదీసిన సంఘటన ఓదెల మండలంలో చోటు చేసుకుంది స్థానిక వివరాలలోకి వెళితే శనివారం ఓదెల మండలంలోని భీమరిపల్లి గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా ఐకెపి మహిళా సంఘ ల ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహిస్తున్నారు ఈసారి కొనుగోలు కేంద్రాన్ని బ్లాక్ లిస్టులో పెట్టడంతో మహిళా సంఘాల నాయకులతో పాటు రైతులు మండల కేంద్రంలోని ఏపిఎం సంపత్ ను నిలదీశారు కొనుగోలు కేంద్రాన్ని ఎందుకు బ్లాక్ లిస్టులో పెట్టడం జరిగిందో దాన్ని వివరణ ఇవ్వాలని లేకపోతే రైతులతో సహా అందరం ధర్నా చేస్తామని చెప్పడం జరిగింది. దీనికి నా చేతిలో ఏముంది అంతా పై ఆఫీసర్ చెప్పినట్టే చేశాను అని పొంతన లేని సమాధానం చెప్పడంతో రైతులు మహిళా సంఘాల నాయకులు ఆగ్రహానికి లోనయ్యారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వరి కోతలు మొదలై దాదాపు 20 రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు
వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఎందుకు ప్రారంభించడం లేదని ఆర తీయడంతో తీరా ఈ కొనుగోలు కేంద్రాన్ని బ్లాక్ లిస్టులో పెట్టినట్టు గతంలో ఇందులో అవకతవకలు జరిగాయని తీవ్రమైన ఆరోపణ చేయడం సరైన పద్ధతి కాదని దీన్ని వెంటనే ప్రజలు గ్రామ రైతుల ఆధ్వర్యంలో వివరణ ఇవ్వాలని లేకపోతే ధర్నా చేయడం జరుగుతుందని హెచ్చరించారు అదేవిధంగా రైతుల కు మా గ్రామంలో కొనుగోలు కేంద్రం లేకపోవడంతో పక్క గ్రామాలైన పందిళ్ళ జీలకుంట, కొనుగోలు కేంద్రాలకు వెళ్ళవలసిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు . ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో మోసం జరిగిందంటూ ఐకెపి సెంటర్ నిర్వాహకులపై అధికారులకు తెలపడంతో కొనుగోలు కేంద్రాన్ని బ్లాక్ లిస్టులో పెట్టారని వారు అన్నారు. రైతును రాజును చేస్తానంటూ ప్రజా ప్రభుత్వంలో రైతులు పండించిన పంటలు అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రం లేక భీమరిపల్లి రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు . ఈ సందర్భంగా సెంటర్ నిర్వహించారు సిఏ జంగా సునీత మాట్లాడుతూ అధికారులు కొనుగోలు కేంద్రంపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని తప్పకుండా దాన్ని నిజనిర్ధారణ చేసి రైతుల ముందు ఉంచాలని కోరారు ఏది ఏమైనా గ్రామపంచాయతీ ఆవరణంలో గ్రామసభ నిర్వహించి రైతులకు సరియైనటువంటి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## సెల్ఫ్ ఏనుమరేషన్ సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/25 ఏప్రిల్/ అక్షరం న్యూస్:
జనగణన ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సెల్ఫ్ ఏనుమరేషన్ (సెల్ఫ్ ఇన్యూమిరేషన్) విధానాన్ని ప్రజలు విస్తృతంగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు నిర్వహించనున్న సెల్ఫ్ ఏనుమరేషన్ కార్యక్రమంపై శనివారం ఐడీఓసి కార్యాలయంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి పత్రికా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సంప్రదాయ విధానంలో ఇంటింటికీ వచ్చే గణన అధికారుల కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేకుండా, ప్రజలు తమకు అనుకూలమైన సమయంలో ఆన్‌లైన్ ద్వారా తమ కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ విధానం ద్వారా సమయాన్ని ఆదా చేసుకోవడంతో పాటు ఖచ్చితమైన సమాచారాన్ని అందించే అవకాశముంటుందని తెలిపారు .సెల్ఫ్ ఏనుమరేషన్ ద్వారా కుటుంబ సభ్యుల వివరాలు, విద్య, ఉపాధి, ఆస్తులు, గృహ సౌకర్యాలు వంటి కీలక సమాచారాన్ని ప్రజలు స్వయంగా నమోదు చేయడం వల్ల తప్పులు దొర్లే అవకాశం తగ్గుతుందని తెలిపారు. అదేవిధంగా వ్యక్తిగత సమాచారాన్ని నేరుగా అధికారిక వెబ్ పోర్టల్ లేదా మొబైల్ యాప్‌లో నమోదు చేయడం వల్ల గోప్యత మరింత భద్రంగా ఉంటుందని చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో నమోదు చేసిన డేటా వేగంగా, సురక్షితంగా భద్రపరచబడుతుందని వివరించారు.సెల్ఫ్ ఏనుమరేషన్ నమోదు ప్రక్రియను వివరిస్తూ, ప్రభుత్వం ప్రకటించిన అధికారిక వెబ్‌సైట్ https://se.census.gov.in? లోకి వెళ్లి మొబైల్ నంబర్ లేదా ఆధార్ నంబర్‌తో లాగిన్ అవ్వాలని తెలిపారు. తదుపరి తెలుగు లేదా అనుకూలమైన భాషను ఎంపిక చేసుకుని, మ్యాప్‌లో నివాసాన్ని జియో-ట్యాగ్ చేసి, గృహ మరియు కుటుంబానికి సంబంధించిన మొత్తం 33 ప్రశ్నలకు సమాధానాలు నమోదు చేయాలన్నారు. వివరాలను సరిచూసుకుని సబ్మిట్ చేసిన తర్వాత మొబైల్‌కు వచ్చే ఎస్ ఈ ఐడి ను ను భద్రపరచుకుని, ఇంటింటి సర్వేకు వచ్చే గణాంక సిబ్బందికి చూపించాలని సూచించారు.ప్రతి కుటుంబం ఒక మొబైల్ నంబర్‌ను మాత్రమే ఉపయోగించాల్సి ఉంటుందని, ఈ సేవ పూర్తిగా ఉచితమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆన్‌లైన్‌లో నమోదు చేయలేని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, గణాంక సిబ్బంది నేరుగా ఇంటికి వచ్చి వివరాలు సేకరిస్తారని తెలిపారు.జనగణన దేశాభివృద్ధికి అత్యంత కీలకమైన ప్రక్రియగా పేర్కొంటూ, ప్రజలు అందించే ఖచ్చితమైన సమాచారం ఆధారంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు, విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో సమర్థవంతమైన ప్రణాళికలు రూపొందించబడతాయని కలెక్టర్ వివరించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కలెక్టర్ విద్యా చందన, సిపిఓ సంజీవరావు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో క్రీడల పాత్ర కీలకం

- క్రమశిక్షణతో కూడిన క్రీడా స్ఫూర్తే భవిష్యత్తుకు పునాది
- క్రీడలు ఒత్తిడిని తగ్గించి మానసిక ఉల్లాసాన్ని ప్రసాదిస్తాయి
- వేసవి సెలవుల్లో విద్యార్థులు క్రీడలపై మక్కువ పెంచుకోవాలి
- నియోజకవర్గ విద్యార్థులకు ఉచిత శిక్షణాశిబిరం సువర్ణ అవకాశం
- సెల్‌ఫోన్ల మాయలో పడకుండా మైదానాల్లో ప్రతిభ చాటాలి
- జూన్ 7 వరకు సాగనున్న క్రీడా సంబరం





కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/25 ఏప్రిల్/ అక్షరం న్యూస్:
ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో క్రీడల పాత్ర కీలకమని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం కొత్తగూడెం పట్టణంలోని సింగరేణి సిఈఆర్ క్లబ్బులో ఏర్పాటు చేసిన సమ్మర్ స్పోర్ట్స్, గేమ్స్ కోచింగ్ క్యాంపును ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రమశిక్షణతో కూడిన క్రీడా స్ఫూర్తే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని ఆకాంక్షించారు. క్రీడలు కేవలం శారీరక దృఢత్వాన్నే కాకుండా, మానసిక ఒత్తిడిని తగ్గించి విద్యార్థులలో అపారమైన ఉల్లాసాన్ని, ఏకాగ్రతను ప్రసాదిస్తాయని పేర్కొన్నారు. వేసవి సెలవులను కేవలం వినోదానికే పరిమితం చేయకుండా, విద్యార్థులు క్రీడలపై మక్కువ పెంచుకుని తమలోని అంతర్గత ప్రతిభను వెలికితీయాలని సూచించారు. నియోజకవర్గ పరిధిలోని విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఈ ఉచిత శిక్షణాశిబిరం ఒక సువర్ణ అవకాశమని, దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నేటి తరం పిల్లలు ఇళ్లకే పరిమితమై సెల్‌ఫోన్ల మాయలో పడి సమయాన్ని వృథా చేయకుండా, మైదానాల్లో చెమటోడ్చి ఆడితేనే రేపటి చాంపియన్లుగా ఎదగగలరని ఎమ్మెల్యే హితవు పలికారు. ఈ శిబిరంలో కబడ్డీ, క్రికెట్, స్విమింగ్, యోగా, అథ్లెటిక్, నెట్ బాల్, ఆర్చరీ, బాస్కెట్ బాల్, బాక్సింగ్, టేబుల్ టెన్నిస్ వంటి పది రకాల క్రీడల్లో నిష్ణాతులైన కోచ్‌లతో శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. జూన్ 7వ తేదీ వరకు నెల రోజుల పాటు సాగనున్న ఈ క్రీడా సంబరంలో విద్యార్థులు చురుగ్గా పాల్గొని మెళకువలు నేర్చుకోవాలని కోరారు. క్రీడల ద్వారా అలవడే ఓర్పు, పట్టుదల జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి తోడ్పడతాయని అన్నారు. క్రీడాకారులకు కావాల్సిన అన్ని మౌలిక వసతులను సింగరేణి సహకారంతో కల్పిస్తున్నామని, తల్లిదండ్రులు కూడా పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహించాలని ఎమ్మెల్యే సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా కార్యాలయం అధికారి పరంధామ రెడ్డి, జిల్లా అథ్లెటిక్ సెక్రటరీ మహేందర్, బాక్సింగ్ మట్టపర్తి రమేష్, యుగంధర్ రెడ్డి, రమేష్ నాయుడు, వెంటేశ్వర్లు, మల్లికార్జున, నాగేందర్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.









## ఏప్రిల్ 26 ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం

- బోడ కుంటి శంకర్

ఓదెల/పెద్దపల్లి ఏప్రిల్ 25(అక్షరం న్యూస్)
ఓదెల:కంటి వ్యాధులపై ఈ నెల 26 ఆదివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరం అత్యాధునిక కంప్యూటర్ తో నిర్వహిస్తున్నట్లు ఓదెల మాజీ ఎంపీటీసీ లిబోడకుంట శంకర్‌లి తెలిపారు.లయన్స్ క్లబ్ విజన్ కేర్ వ్యవస్థాపక అధ్యక్షులు నేత్రవైద్య నిపుణులు లిపూదరి దత్తాగౌడ్‌లి సహకారంతో ఓదెలలోని లిశ్రీ వివేకానంద విద్యాలయంలి లో నిర్వహిస్తామన్నారు.కంటి పొరలు,కంటి పై దురుమాంసం తో బాధపడుతున్నవారికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామన్నారు.ఉచిత రవాణా భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు.ఆదివారం పరీక్షలు చేసుకున్నవారిని బుధవారం కంటి శస్త్ర చికిత్సలకు తరలిస్తామన్నారు. ఈ సదవాకాశాన్ని ఓదెల మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.వివరాలకు బోడకుంట శంకర్‌మాజీ ఎంపీటీసీ,పల్కపాటి రాజేష్ కుమార్ కరెస్పాండంట్ గీతాంజలి డిగ్రీ కళాశాల, లగిశెట్టి వంశీనేత్రవైద్య సహాయకులు గార్లను సంప్రదించగలరు.
వశ్రీశ్రీ:9618113729,7013575638,7032975096



## దోమలు మనుషులను ఎలా గుర్తించి కుడతాయి..? సైంటిస్టుల ఆసక్తికర పరిశోధన..



దోమలు మనుషలను ఎలా గుర్తించి కుడతాయో తెలుసుకునేందుకు శాస్త్రవేత్తలు చేసిన తాజా అధ్యయనం ఆసక్తికర విషయాలను బయటపెట్టింది. ఇప్పటివరకు దోమలు ఒకదానిని ఒకటి అనుసరిస్తాయని అనుకునే వారు, కానీ ఈ పరిశోధన ఆ భావనను పూర్తిగా మార్చేసింది. అసలు విషయానికి వస్తే, దోమలు నాయకుడిని అనుసరించవని, పర్యావరణ సంకేతాలను అనుసరిస్తాయని పరిశోధకులు తెలియజేస్తున్నారు. అమెరికాలోని జార్జియా టెక్, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీటు)కి చెందిన పరిశోధకులు అధిక సంఖ్యలో దోమలను పరిశీలించి, సుమారు 20 మిలియన్ల డేటా పాయింట్లను విశ్లేషించారు. ఈ అధ్యయనంలో ముఖ్యంగా ఆడ ఏడిస్ ఈజిప్టై (ూవవసవం ఖవస్త్రఎజూఱ) దోమల ప్రవర్తనను పరిశీలించారు. ఈ దోమలే సాధారణంగా యెల్లో ఫీవర్ వంటి వ్యాధులను వ్యాపింపజేస్తాయి.

### 3డీ ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలతో..

పరిశోధకులు 3డీ ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలను ఉపయోగించి, దోమలు మనుషల చుట్టూ ఎలా కదులుతాయో గమనించారు. ముఖ్యంగా కార్బన్ డయాక్సైడ్ వాసన, విజువల్ సంకేతాలు (రంగులు, ఆకారాలు) దోమలను ఆకర్షించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని గుర్తించారు. ఒక మనిషిని కంట్రోల్డ్ ఛాంబర్‌లో ఉంచి, అతని దుస్తుల రంగులను మార్చుతూ పరీక్షలు నిర్వహించారు. ఈ పరిశోధనలో కీలకమైన విషయం ఏమిటంటే ప్రతి దోమ స్వతంత్రంగా స్పందించింది. అవి గుంపుగా కనిపించినా, ఒకదానిని ఒకటి అనుసరించడం వల్ల కాదు. ఒకే రకమైన సంకేతాలకు ఆకర్షితమై, అవన్నీ ఒకే ప్రదేశానికి చేరుకుంటాయి. అంటే, అవి ఒకే సమయంలో ఒకే ప్రదేశంలో ఉండటం యాదృచ్ఛికం కాదు, కానీ ఒకే కారణం వల్ల జరుగుతుంది. ఈ విషయాన్ని శాస్త్రవేత్తలు ఒక ఉదాహరణతో వివరించారు. బిజీగా ఉన్న బార్‌లో ఉన్నవాళ్లు ఒకరిని ఒకరు అనుసరించి రారు. అక్కడ ఉన్న సంగీతం, వాతావరణం, పానీయాలు వారిని ఆకర్షిస్తాయి. అదే విధంగా దోమలు కూడా సంకేతాలను అనుసరిస్తాయి.. అని చెప్పారు.

### గణిత మోడల్ రూపకల్పన..

ఈ అధ్యయనం ద్వారా దోమలు ఎలా నిర్ణయం తీసుకుంటాయో అర్థం చేసుకోవడానికి గణిత మోడల్ కూడా రూపొందించారు. భవిష్యత్తులో ఇది మెరుగైన పెస్ట్ కంట్రోల్ పద్ధతులను అభివృద్ధి చేయడానికి సహాయపడుతుంది. ముఖ్యంగా మలేరియా, జికా, యెల్లో ఫీవర్ వంటి ప్రమాదకర వ్యాధులను వ్యాపింపజేసే దోమలను నియంత్రించడంలో ఇది ఉపయోగపడుతుందని నిపుణులు భావిస్తున్నారు. ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ప్రాణాలు తీస్తున్న ఈ దోమలపై నియంత్రణ సాధించేందుకు ఈ పరిశోధన కీలక అడుగుగా మారుతుందని అంచనా వేస్తున్నారు.

## మహిళలు తమ ఆరోగ్యం కోసం ఈ మొక్కలను తమ జీవితంలో భాగం చేసుకోవాలి



మహిళల ఆరోగ్యం అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. హార్మోన్ల మార్పులు, జీవనశైలి, రోజువారీ పనులు, భావోద్వేగ పరిస్థితులు వంటివి అన్నీ కలిసి శరీర సమతౌల్యాన్ని ప్రభావితం చేస్తాయి. ప్రస్తుతం చాలా మంది మహిళలు మూడ్ మార్పులు, అలసట, నిద్రలో అంతరాయం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలు దీర్ఘకాలంలో హార్మోన్ల అసమతౌల్యం, జీర్ణక్రియ లోపాలు, శరీర శక్తి తగ్గుదలకు దారితీస్తాయి. ఈ నేపథ్యంలో ఆయుర్వేదం సహజమైన పరిష్కారాలను అందిస్తుంది. ఆయుర్వేద నిపుణులు సూచించిన ప్రకారం, మహిళలు రోజువారీ ఆహారంలో కొన్ని ప్రత్యేక ఔషధ మొక్కలను చేర్చుకుంటే ఆరోగ్యానికి మేలు కలుగుతుంది. ఈ మూడు ముఖ్యమైన మొక్కలు హార్మోన్ల సమతౌల్యాన్ని మెరుగుపరచడంలో, ఒత్తిడిని తగ్గించడంలో, మొత్తం శరీర ఆరోగ్యాన్ని బలోపేతం చేయడంలో సహాయపడతాయి. మహిళలు రోజువారి ఆహారంలో చేర్చుకోవాల్సిన ముఖ్యమైన మొక్కల గురించి నిపుణులు వివరిస్తున్నారు.

### అదశ్వగంధ, శతావరి..

మహిళలు తీసుకోవాల్సిన మొక్కల్లో మొదటిది అశ్వగంధ మొక్క. ఇది శక్తివంతమైన అడాప్టోజెన్‌గా పనిచేస్తుంది. ఇది ఒత్తిడి, ఆందోళనను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అధిక కార్టిసోల్ స్థాయిలను నియంత్రించడంతోపాటు నర్వస్ సిస్టమ్‌ను సమతుల్యం చేస్తుంది. థైరాయిడ్, అడ్రినల్ గ్రంథుల పనితీరును మెరుగుపరచడంలో కూడా అశ్వగంధ సహాయపడుతుంది. శక్తి, ఉత్సాహం పెరగడమే కాకుండా భావోద్వేగ స్థిరత్వాన్ని కూడా ఇది పెంపొందిస్తుంది. ఇక రెండవది శతావరి. దీనిని హెర్బ్స్ క్వీన్ అని పిలుస్తారు. మహిళల ఆరోగ్యానికి ఇది ప్రత్యేకంగా ఉపయోగకరంగా ఉంటుంది. పీసీవోఎస్, వంధ్యత్వ సమస్యలు, గైనకాలజీ సమస్యలు, మెనోపాజ్ దశలో ఉన్న మహిళలకు ఇది ఉపశమనాన్ని అందిస్తుంది. హార్మోన్ల సమతౌల్యాన్ని కాపాడటంలో, ఇన్‌ఫ్లమేషన్ (వాపు) తగ్గించడంలో, ఓవరీల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో శతావరి ముఖ్య పాత్ర పోషిస్తుంది. అలాగే పీరియడ్స్ సమస్యలు, పీఎంఎస్ లక్షణాలను తగ్గించడంలో కూడా ఇది ఉపయోగపడుతుంది.

### తులసి..

ఇక మూడవది తులసి. ప్రతి భారతీయ ఇంట్లో దొరికే ఈ ఔషధ మొక్క అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. తులసి ఒత్తిడి, ఆందోళన తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది సెరటోనిన్ ఉత్పత్తిని పెంచి మానసిక ప్రశాంతతను కలిగిస్తుంది. అలాగే జీర్ణక్రియను మెరుగుపరచడం, మెటబాలిజం పెంచడం, ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని కాపాడడం వంటి ప్రయోజనాలు కూడా కలిగి ఉంటుంది. ఈ మూడు మొక్కలను రోజువారీ జీవితంలో చేర్చుకోవడం ద్వారా మహిళలు శరీర, మానసిక ఆరోగ్యాన్ని సమతుల్యం చేసుకోవచ్చు. హార్మోన్ల సమతౌల్యం, మెరుగైన నిద్ర, మంచి జీర్ణక్రియ, శారీక శక్తి పెరగడం వంటివన్నీ కూడా ఈ ఔషధాలను తీసుకోవడం ద్వారా సాధ్యమవుతాయి. సహజమైన ఈ మార్గాలు మహిళల ఆరోగ్యాన్ని నెమ్మదిగా, కానీ స్థిరంగా మెరుగుపరచడంలో సహాయపడతాయని ఆయుర్వేద నిపుణులు తెలియజేస్తున్నారు.

# పోటీ లేకుండా 'సహకారం'



- పీ ఏ సీ ఎస్ పదవులు ఇక నామినేటెడ్
- నామినేటెడ్ పదవులపై నేతల ఆశలు

రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /ఏప్రిల్ -25(అక్షరం న్యూస్ )

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలక వర్గాలకు నామినేటెడ్ పద్ధతి లో కొత్త కార్యవర్గ లను నియమించాలని నిర్ణయం రాజకీయం వేడెక్కించింది

తెలంగాణలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పాక్స్ ) పాలకవర్గాలను ఎన్నికల ద్వారా కాకుండా, నామినేటెడ్ పద్ధతిలో నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం



నిర్ణయించడంతో, కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో ఆశలు పెరిగాయినామినేటెడ్ పద్ధతిలో నియామకం లో ఎమ్మెల్యే ల ప్రతి పాదనలు కీలకం కానున్నాయి. జిల్లా మంత్రులు ఇంచార్జి మంత్రులు కూడా ఇందులో భాగం కానున్నారు.

### 100 శాతం అధికార పార్టీ కార్యకర్తలకే..

ఎన్నికలు నిర్వహిస్తే ఏ పార్టీ అభ్యర్థులైనా గెలిచే అవకాశం ఉంటుంది. సాధారణంగా రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకే ఎక్కువ పీఏసీఎ?సలు వస్తాయి. అయితే, ఎన్నికల నిర్వహణ తదితర ఖర్చులన్నీ తడిసి మోపెడవుతాయని, నామినేషన్ పద్ధతిలో నియామకాలు చేస్తే ఏ గొడవా ఉండదనే ఆలోచనకు రాష్ట్ర ప్రభుత్వం వచ్చినట్లు తెలిసింది. ఈ ప్రక్రియతో 100 శాతం పోస్టులు అధికార పార్టీ కార్యకర్తలకే వస్తాయి

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రస్తుతం జిల్లా లో 24 సంఘాలు ఉన్నాయి. సంఘాల పరిధిలో 74,728 మంది సభ్యులు ఉన్నారు. సిరిసిల్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో 12,859 మంది సభ్యులు ఉండగా, పెద్దూరు సొసైటీలో 1,336 మంది, నేరెల్ల సొసైటీలో 1,257 మంది, కోనరావుపేట సొసైటీలో 6,196 మంది, కొలనూరు సొసైటీలో 3,018 మంది, వేములవాడ సొసైటీలో 8,180 మంది, నాంపెల్లి సొసైటీలో 1,191 మంది, రుద్రవరం సొసైటీలో 998 మంది, చందుర్తి సొసైటీలో 3,369 మంది, సనుగుల సొసైటీలో 1,733 మంది, బోయినిపల్లి సొసైటీలో 910 మంది, కోరెం సొసైటీలో 1,694 మంది, మాన్వాడ సొసైటీలో 1,163 మంది, నర్సింగాపూర్ సొసైటీలో 1,684 మంది, ఇల్లంతకుంట సొసైటీలో 3,547 మంది, గాలిపెల్లి సొసైటీలో1,680 మంది, ముస్తాబాద్ సొసైటీలో 2,082 మంది, పోత్గల్ సొసైటీలో 7,169 మంది, గంభీరావుపేట సొసైటీలో 8,183 మంది, కొత్తపెల్లి సొసైటీలో 3,680 మంది, ఎల్లారెడ్డిపేట సొసైటీలో 3,864 మంది, అల్మాస్‌పూర్ సొసైటీలో 2,139 మంది, తిమ్మాపూర్ సొసైటీలో 1,597 మంది, మానాల సొసైటీలో 199 మంది సభ్యులు ఉన్నారు.

### ఆశావాహులకు పదవులు..

జిల్లాలో 24 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయి. నామినేటెడ్ ద్వారా 312 మందికి పదవులు దక్కనున్నాయి. సహకార చట్టం ప్రకారం ప్రతి సొసైటీకి 13 మందితో పాలకవర్గం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇందులో ఒకరు చైర్మన్, ఒక వైస్‌చైర్మన్, 11 మంది డైరెక్టర్లు ఉంటారు. ఎస్సీ మహిళా, ఎస్టీ జనరల్, బీసీ జనరల్‌కు మూడు డైరెక్టర్ పోస్టులను కేటాయించాల్సి ఉంటుందిఇదే మాదిరిగా జిల్లా కేంద్ర సహకార బ్యాంక్, జిల్లా సహకార మార్కెటింగ్ సమాఖ్య, మార్క్‌ఫెడ్, టెస్కాబ్ పాలవర్గాలు కూడా నియమిస్తారు. ప్రభుత్వం మాత్రం సొసైటీలో సభ్యత్వం ఉన్నవారిని నామినేటెడ్ చేసే ఆలోచనలు ఉండడంతో సొసైటీలో అధికార పార్టీకి చెందిన సభ్యులు ముందుకు వస్తున్నారు. దీంతో జిల్లాలో మరోసారి అధికార పార్టీలో నేతల మధ్య నామినేటెడ్ చర్చలు మొదలయ్యాయి. ఇందుకు సంబంధించిన విధివిధానాలు ఎలా ఉండబోతున్నాయనే ఆసక్తి సొసైటీ సభ్యులు ఏర్పడింది.



# వేసవిలో పెరుగు తోడుపెట్టాక పుల్లగా మారకుండా ఉండాలంటే ఇలా చేయాలి..



వేసవి కాలంలో చల్లదనం కోసం పెరుగును ఎక్కువగా ఆహారంలో భాగంగా తీసుకుంటూ ఉంటారు. అలాగే పెరుగుతో మజ్జిగ, లస్సీ వంటి వాటిని తయారు చేసి తీసుకుంటూ ఉంటారు. అయితే వేసవికాలంలో ఇంట్లో పెరుగు పెట్టడం చాలాసార్లు కష్టంగా అనిపిస్తుంది. సాధారణంగా క్రీమీగా, మృదువుగా ఉండాల్సిన పెరుగు వేడి కారణంగా చాలా త్వరగా పుల్లగా మారిపోతుంది. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటంతో ఫెర్మెంటేషన్ వేగంగా జరుగుతుంది. అయితే ఈ సమస్యకు ఒక చిన్న చిట్కా మంచి పరిష్కారం చూపుతుంది. ఈ చిట్కా పెరుగును తీపిగా మార్చదు కానీ ఫెర్మెంటేషన్ ప్రక్రియను సమతుల్యం చేస్తుంది. సరైన సమయంలో చక్కెర వేసినప్పుడు బ్యాక్టీరియా క్రియాశీలత కొంచెం నియంత్రితమవుతుంది. దీని వల్ల పెరుగు అధికంగా పుల్లగా మారకుండా ఉంటుంది.

### ఫెర్మెంటేషన్ నియంత్రణలో ఉండేలా..


వేసవిలో బ్యాక్టీరియా వేగంగా పెరగడం వల్ల పెరుగు త్వరగా పుల్లగా మారే ప్రమాదం ఉంటుంది. అలాంటి సందర్భంలో కొద్దిగా చక్కెర బఫర్‌లా పనిచేస్తుంది. ఇది ఫెర్మెంటేషన్‌ను పూర్తిగా ఆపదు కానీ నియంత్రణలో ఉంచుతుంది. ఫలితంగా పెరుగు మృదువుగా, సమతుల్య రుచితో తయారవుతుంది. చక్కెర వల్ల పెరుగు టెక్స్చర్ కూడా మెరుగవుతుంది. ఇది సజావుగా సెట్ అవ్వడానికి సహాయపడుతుంది. గింజల్లా కాకుండా సాఫ్ట్‌గా, క్రీమీగా ఉండేలా చేస్తుంది. ముఖ్యంగా వేసవిలో పాలు నాణ్యత తగ్గినప్పుడు లేదా వాతావరణం మారినప్పుడు ఈ చిట్కా మరింత ఉపయోగపడుతుంది. ఇంకొక ముఖ్యమైన ప్రయోజనం ఏమిటంటే, పెరుగు ఎక్కువగా పుల్లగా మారకుండా నివారించడం. చక్కెర ఆమ్లత్వాన్ని కొద్దిగా తగ్గించి రుచిని సున్నితంగా చేస్తుంది. దీంతో రోజువారీ ఆహారంలో తినడానికి అనువైన మైల్డ్ టేస్ట్ వస్తుంది.

### ఇలా చేయాలి..

ఈ చిట్కాను ఉపయోగించే విధానం కూడా సులభమే. ముందుగా పాలను వేడి చేసి కొద్దిగా చల్లార్చాలి. గోరువెచ్చగా ఉన్నప్పుడు పాత పెరుగు (స్టార్టర్) వేసి కలపాలి. ఆ తర్వాత ఒక లీటర్ పాలకు సుమారు ¼ టీ స్పూన్ చక్కెర వేసి నెమ్మదిగా కలపాలి. తరువాత మూతపెట్టి కదలకుండా ఉంచాలి. అయితే కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. ఎక్కువ చక్కెర వేస్తే రుచి మారిపోతుంది. చల్లని కాలంలో ఈ చిట్కా అవసరం ఉండదు. అలాగే చాలా వేడి పాలలో చక్కెర వేయకూడదు. ఇది కల్చర్‌పై ప్రభావం చూపుతుంది. వేసవిలో రాత్రికి పెరుగు పెట్టేటప్పుడు, లేదా పెరుగు త్వరగా పుల్లగా మారుతున్నప్పుడు ఈ చిన్న చిట్కా ఎంతో ఉపయోగపడుతుంది. చిన్న మార్పు అయినప్పటికీ, మంచి రుచితో స్థిరమైన పెరుగు పొందడానికి ఇది సహాయపడుతుంది.

## వేసవిలో శరీరానికి చల్లదనాన్ని, పోషకాలను అందించే

# అద్భుతమైన పానీయం ఇది.. ఎలా తయారు చేయాలంటే..?



వేసవి కాలం ప్రారంభమయ్యాక చల్లని పానీయాలు రోజువారీ జీవితంలో భాగమవుతాయి. మార్కెట్‌లో రెడీమేడ్ డ్రింక్స్, మిక్స్‌లు సులభంగా లభిస్తున్నప్పటికీ, సంప్రదాయ భారతీయ పానీయాలకు ప్రత్యేక స్థానం ఇప్పటికీ ఉంది. అలాంటి ప్రసిద్ధ పానీయాల్లో తండాయి ఒకటి. ఇది రుచితోపాటు శరీరాన్ని చల్లబరచే గుణాల వల్ల ప్రత్యేకంగా గుర్తింపు పొందింది. సాధారణంగా హోలీ పండుగ సమయంలో ఎక్కువగా తయారుచేసే తండాయి, వేసవి మొత్తం తాగడానికి అనువైన పానీయం. పాలు, డ్రై ఫ్రూట్స్, సుగంధ ద్రవ్యాలు, గులాబీ రేకులు, కుంకుమపువ్వు కలిపి తయారు చేసే ఈ పానీయం శరీరానికి శక్తిని అందించడమే కాకుండా, తాగిన వెంటనే తాజాగా అనిపించేలా చేస్తుంది. ఇంట్లో తండాయి మసాలా తయారు చేసుకోవడం వల్ల మనకు కావలసిన రుచులు, తీపి స్థాయి అన్నీ మనమే నియంత్రించుకోవచ్చు.


### ఇలా చేయాలి..

ఇంట్లో తండాయి మసాలా తయారీ చాలా సులభం. బాదం, జీడిపప్పు, పిస్తా వంటి డ్రై ఫ్రూట్స్‌తో పాటు సోంపు, గసగసాలు, యాలకులు, మిరియాలు వంటి సుగంధ ద్రవ్యాలు ప్రధానంగా ఉపయోగిస్తారు. వీటితోపాటు గులాబీ రేకులు, కుంకుమపువ్వు కూడా ప్రత్యేక సువాసనను ఇస్తాయి. తయారీ విధానంలో మొదట అన్ని డ్రై ఫ్రూట్స్, గింజలను శుభ్రంగా కడిగి పూర్తిగా ఆరబెట్టాలి. తేమ లేకుండా ఉండేలా చూసుకోవాలి. తరువాత యాలకులు, మిరియాలు, సోంపు, గసగసాలు మొదటగా మెత్తగా పొడి చేయాలి. తరువాత బాదం, జీడిపప్పు, పిస్తా, మెలన్ గింజలను వేసి కొద్దిగా దట్టంగా ఉండేలా గ్రైండ్ చేయాలి. ఆ తరువాత గులాబీ రేకులు, కుంకుమపువ్వు వేసి మరోసారి మిక్స్ చేయాలి. ఈ మిశ్రమం సువాసనతో కూడిన మసాలాగా తయారవుతుంది. పూర్తిగా చల్లారిన తరువాత గాలి చొరబడని సీసాలో నిల్వచేస్తే ఎక్కువ రోజుల పాటు తాజాగా ఉంటుంది.

### చల్లని పాలలో కలిపి..

ఈ మసాలాతో తండాయి తయారు చేయడం కూడా చాలా ఈజీ. చల్లని పాలలో ఒకటి లేదా రెండు టీస్పూన్లు మసాలా కలిపి, అవసరమైతే చక్కెర వేసి బాగా కలిపి సర్వ్ చేస్తే చాలు. ఇది శరీరాన్ని లోపల నుంచి చల్లబరచడంలో సహాయపడుతుంది. ఇంట్లో తయారు చేసిన తండాయి మసాలా సహజమైన రుచితో పాటు ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది. అయితే ఇది తీపి ఎక్కువగా ఉండే పానీయం కాబట్టి మితంగా తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

# చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గి మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు పెరగాలంటే.. వీటిని తీసుకోవాలి..




ఆరోగ్యానికి కొలెస్ట్రాల్ చాలా అవసరం. కొలెస్ట్రాల్ సహజంగానే హానికరం కాదు. కొలెస్ట్రాల్ వివిధ శారీరక విధుల్లో కీలక పాత్ర పోషిస్తుంది. హార్మోన్ల ఉత్పత్తికి, విటమిన్ డి, పిత్త ఆమ్లాల ఉత్పత్తికి ఇది చాలా అవసరం. కొలెస్ట్రాల్ లో కూడా మంచి కొలెస్ట్రాల్, చెడు కొలెస్ట్రాల్ అని రెండు రకాలు ఉంటాయి. కొలెస్ట్రాల్ శరీరానికి అవసరమే అయినప్పటికీ తక్కువ స్థాయిలో మంచి కొలెస్ట్రాల్ ఉండడం, ఎక్కువ స్థాయిలో చెడు కొలెస్ట్రాల్ ఉండడం వల్ల గుండె ప్రమాదాలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు ఎక్కువగా ఉండడం వల్ల ధమనుల్లో ఫలకాలు ఏర్పడే అవకాశం ఉంటుంది. ఈ పరిస్థితిని అథెరోస్క్లెరోసిస్ అంటారు. ధమనులు గట్టిపడడం, సంకోచించడం వల్ల రక్తప్రవాహం సాఫీగా సాగదు. దీంతో తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. అలాగే శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు ఎక్కువగా ఉండడం వల్ల గుండె జబ్బులు, స్ట్రోక్, అధిక రక్తపోటు, పిత్తాశయంలో రాళ్లు వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కనుక శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలను ఎల్లప్పుడూ అదుపులో ఉంచుకోవాలి. ఆహారంతో పాటు జీవనశైలిలో మార్పులు చేసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలను అదుపులో ఉంచుకోవచ్చు.

### ఫైబర్, గింజలు..

రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలు ఎక్కువగా ఉన్న వారు కొవ్వు కలిగిన ఆహారాలను తీసుకోవడం తగ్గించాలి. ఫైబర్ ను ఎక్కువగా తీసుకోవాలి. రోజూ 10 నుండి 25 గ్రాముల కరిగే ఫైబర్ ను తీసుకోవడం లక్ష్యంగా పెట్టుకోవాలి. దీని వల్ల మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయి. నూనెలో వేయించిన, ప్యాక్ చేసిన ఆహారాలు చెడు కొలెస్ట్రాల్ ను పెంచుతాయి. కనుక వీటికి దూరంగా ఉండాలి. ఆలివ్ నూనె, అవకాడో, గింజలు వంటి ఆహారాలను తీసుకోవాలి. సాల్మన్, మాకెరెల్ వంటి చేపలను ఆహారంగా తీసుకోవాలి. భోజనంలో చిక్కుళ్లు, గింజలు, తృణ ధాన్యాలు వంటి వాటిని తీసుకోవాలి. ఇవి కొలెస్ట్రాల్ స్థాయిలను మెరుగుపరచడంలో ఎంతో సహాయపడతాయి.

### 5 నుంచి 10 శాతం బరువు తగ్గాలి..

అలాగే ఆరోగ్యకరమైన శరీర బరువు ఉండేలా చూసుకోవాలి. శరీర బరువులో 5 నుండి 10 శాతం వరకు తగ్గడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిల్లో గణనీయమైన మార్పులు వస్తాయి. శరీర బరువును అదుపులో ఉంచుకోవడానికి క్రమం తప్పకుండా వ్యాయామాలు చేస్తూ ఉండాలి. నడక, ఈత, సైక్లింగ్ వంటివి చేయడం వల్ల చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గి మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయి. ధూమపానం రక్తనాళాలను దెబ్బతీస్తుంది. చెడు కొలెస్ట్రాల్ పెరిగేలా చేస్తుంది. అదే విధంగా మద్యపానం కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచడంతో పాటు ఇతర అనారోగ్య సమస్యలకు దారి తీస్తుంది. కనుక ధూమపానానికి, మద్యపానానికి దూరంగా ఉండడం మంచిది.

### ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు..

ఇక ఒత్తిడి కూడా కొలెస్ట్రాల్ ను పెంచే హార్మోన్లను ప్రేరేపిస్తుంది. కనుక ఒత్తిడిని అదుపులో ఉంచుకోవాలి. వీటితో పాటు ఒమెగా 3 ఫ్యాటీ ఆమ్లాలు, కరిగే ఫైబర్, మొక్కల స్టెరాల్స్ వంటి కొన్ని రకాల సప్లిమెంట్స్ ను తీసుకోవాలి. ఇవి కొలెస్ట్రాల్ ను తగ్గించడంలో సహాయపడతాయి. అయితే వీటిని వైద్యుల సంరక్షణలో వాడడం మంచిది. జీవనశైలిలో, తీసుకునే ఆహారంలో మార్పులు చేసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గడంతో పాటు హృదయ ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. అలాగే తరచూ కొలెస్ట్రాల్ స్థాయిలను పరీక్షించుకుంటూ ఉండాలి. జన్యుపరంగా కొలెస్ట్రాల్, గుండె జబ్బులు వచ్చే అవకాశం ఉన్న వారు తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలి. ముందుగానే గుర్తించడం వల్ల సమస్యలు మరింత తీవ్రతరం కాకుండా శరీరాన్ని సంరక్షించుకోవచ్చని వైద్యులు తెలియజేస్తున్నారు.


# ప్రీ డయాబెటిస్ ఎందుకు వస్తుంది..?

**• దీన్నుంచి బయట పడాలంటే ఏం చేయాలి..?**

ప్రస్తుత కాలంలో చాలా మంది వయసుతో సంబంధం లేకుండా టైప్ 2 డయాబెటిస్ బారిన పడుతున్నారు. అయితే ఈ వ్యాధి ఆకస్మాత్తుగా రాదు. ఇది సంవత్సరాల పాటు నెమ్మదిగా అభివృద్ధి చెందుతుంది. అలాగే రక్తంలో చక్కెర స్థాయిలు టైప్ 2 డయాబెటిస్ గా నిర్ధారించేంత లేనప్పుడు దీనిని ప్రీ డయాబెటిస్ గా పరిగణిస్తారు. ప్రీ డయాబెటిస్ ను నియంత్రించకపోతే టైప్ 2 డయాబెటిస్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ప్రీ డయాబెటిస్ రావడానికి సరైన కారణాలు ఇంకా తెలియదనే చెప్పవచ్చు. కానీ అనేక అంశాలు దాని అభివృద్ధికి దోహదం చేస్తాయి. శరీర కణాలు ఇన్సులిన్ కు తక్కువగా ప్రతిస్పందిస్తాయి. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. కుటుంబ చరిత్ర కారణంగా కూడా మధుమేహం వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అధిక బరువు, పొట్ట చుట్టూ కొవ్వు ఎక్కువగా పేరుకుపోవడం వంటి కారణాలు కూడా ప్రీ డయాబెటిస్ కు దారి తీస్తాయి.

### ముందుగానే నియంత్రించాలి..

అలాగే 45 ఏళ్లు పైబడిన వారిలో కూడా ప్రీ డయాబెటిస్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. స్త్రీలల్లో పిసిఓడి వంటి సమస్యలు కూడా ప్రీడయాబెటిస్ కు దారి తీస్తాయి. ప్రీడయాబెటిస్ ను ముందుగానే నియంత్రించడం వల్ల టైప్ 2 డయాబెటిస్ బారిన పడకుండా కాపాడుకోవచ్చు. ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరిచే, రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించే జీవనశైలి మార్పుల ద్వారా ప్రీ డయాబెటిస్ ను తిప్పి కొట్టవచ్చని వైద్యులు చెబుతున్నారు. ప్రీ డయాబెటిస్ తో బాధపడే వారు ఎటువంటి జీవనశైలిని పాటించడం వల్ల దానిని తిప్పికొట్టవచ్చో ఇప్పుడు తెలుసుకుందాం. శరీర బరువును అదుపులో ఉంచుకోవాలి. శరీర బరువులో కనీసం 5 నుండి 7 శాతం తగ్గాలి. ఇలా చేయడం వల్ల టైప్ 2 డయాబెటిస్ వచ్చే అవకాశం 50 శాతం వరకు తగ్గుతుంది.



### సమతుల్య ఆహారం అవసరం..

సంపూర్ణ సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలి. చక్కెరలు, ప్రాసెస్ చేసిన ఆహారాలు, శుద్ధి చేసిన కార్బొహైడ్రేట్స్ ఉన్న ఆహారాలను తీసుకోకూడదు. ప్రోటీన్స్, కూరగాయలు, తృణ ధాన్యాలు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉన్న ఆహారాలను తీసుకోవాలి. అలాగే రోజూ వ్యాయామం చేయాలి. నడక, సైక్లింగ్ వంటి వ్యాయామాలు చేయాలి. వారానికి రెండు సార్లు కండరాలను బలపరిచే శిక్షణ వ్యాయామాలు చేయాలి. ఇలాంటి వ్యాయామాలు చేయడం వల్ల శరీరం గ్లూకోజ్ ను సమర్థవంతంగా గ్రహిస్తుంది. ఇన్సులిన్ సెన్సిటివిటీ, హార్మోన్ల అసమతుల్యత వంటి సమస్యల నుండి బయటపడడానికి రోజూ 7 నుండి 9 గంటల పాటు నిద్రపోవాలి. దీర్ఘకాలిక ఒత్తిడి కారణంగా కార్టిసాల్ ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. ఇది రక్తంలో చక్కెరను పెంచుతుంది. కనుక ఒత్తిడి తగ్గేలా ప్రతిరోజూ 10 నుండి 15 నిమిషాలపాటు ధ్యానం, శ్వాస వ్యాయామాలు చేయాలి.

### ఆరోగ్యకరమైన జీవనశైలి..

ధూమపానం ఇన్సులిన్ నిరోధకతను పెంచుతుంది. కనుక ధూమపానానికి దూరంగా ఉండాలి. దీని వల్ల చక్కెర స్థాయిలు స్థిరంగా ఉండడంతో పాటు గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. తీసుకునే ఆహారం, జీవనశైలి రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను ఎలా ప్రభావితం చేస్తున్నాయో పర్యవేక్షిస్తూ ఉండాలి. అలాగే క్రమం తప్పకుండా వైద్యుడిని సంప్రదించి గ్లూకోజ్ స్థాయిల్లో వచ్చే మార్పులను తెలుసుకుంటూ ఉండాలి. ప్రీ డయాబెటిస్ నిర్ధారణ ఆందోళనకరంగానే ఉంటుంది. అయితే జీవనశైలిలో, ఆహారంలో మార్పులు చేసుకోవడం వల్ల టైప్ 2 డయాబెటిస్ వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. ముందస్తు చర్యలతో టైప్ 2 డయాబెటిస్ బారిన పడకుండా కాపాడుకోవచ్చని వైద్యులు తెలియజేస్తున్నారు.

## తాటి ముంజలను తింటున్నారా..? ఈ విషయాలను తెలుసుకోవాల్సిందే..!

వేసవికాలం అనగానే ముందుగా అందరికీ గుర్తుకు వచ్చేవి మామిడిపండ్లు. అందరూ వీటిని తినడానికి ఎక్కువగా మక్కువ చూపుతారు. కానీ అదే సమయంలో రోడ్ల పక్కన బండ్లపై లభించే ఇతర పండ్లల్లో ఐస్ ఆపిల్ ఒకటి. వీటిని తెలుగులో ముంజలు, తాటి పండ్లు అని అంటారు. వేసవి కాలంలో లభించే ఈ ముంజలు శరీరానికి చల్లదనాన్ని ఇవ్వడంతోపాటు ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయి. ముంజలు తాటిచెట్టు నుండి లభ్యమవుతాయి. ముంజలు పెద్ద కొబ్బరికాయలా కనిపిస్తాయి. బయట గట్టిగా నలుపు రంగు తొక్క కలిగి ఉంటాయి. ముంజల లోపల తెల్లని రంగులో గుజ్జు ఉంటుంది. ఇవి నీటి శాతం ఎక్కువగా కలిగి లిచి పండు కంటే మృదువుగా ఉంటాయి. ముంజలు తాజా కొబ్బరి నీటి రుచిని కలిగి తక్కువ గాఢంగా ఉంటాయి. వేసవిలో వచ్చే వడదెబ్బ, డీహైడ్రేషన్ నుండి బయటపడడానికి వీటిని ఎక్కువగా తీసుకుంటూ ఉంటారు. ఇవి ఎక్కువ కాలం లభించవు. మార్చి నుండి జూన్ వరకు మాత్రమే లభిస్తాయి. వీటిలో నీటి శాతం ఎక్కువగా ఉండడం వల్ల త్వరగా పాడవుతాయి. కనుక వీటిని ఎక్కువగా దూర ప్రాంతాలకు తరలించరు. రోడ్ల పక్కన ఎక్కువగా అమ్ముతూ ఉంటారు.



### అనేక పోషకాలు..

ఇక వీటిని తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి మేలు కలుగుతుందని చెప్పవచ్చు. వీటిలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. కనుక శరీరానికి అవసరమైన నీటిని అందించడంలో ఇవి ఎంతో సహాయపడతాయి. వీటిలో సహజ చక్కెరలు ఉంటాయి కనుక ముంజలను తీసుకోవడం వల్ల తక్షణ శక్తి లభిస్తుంది. ముంజల్లో ఫైబర్, ప్రోటీన్, విటమిన్ ఎ, సి, ఇ, కె లతో పాటు ఐరన్, ఫాస్పరస్, పొటాషియం వంటి పోషకాలు ఉంటాయి. ఆయుర్వేదంలో తాటిపండును శరీర ఉష్ణాన్ని తగ్గించే పండుగా పేర్కొంటారు. వీటిని తీసుకోవడం వల్ల ఆమ్లత్వం, హీట్ రాషెస్, డీహైడ్రేషన్ వల్ల కలిగే తలనొప్పి వంటి సమస్యలు తగ్గుతాయి. వీటిలో తక్కువ క్యాలరీలు ఉంటాయి కనుక వేసవిలో తేలికపాటి స్నాక్స్ గా వీటిని తీసుకోవచ్చు.

### వెంటనే తినేయాలి..

అలాగే ముంజలను కొన్ని రోజే తినడం మంచిది. ముంజలపై ఉండే సన్నని తొక్కను తీసేసి తినాలి. కొందరు వీటిపై బ్లాక్ సాల్ట్ వేసి తీసుకుంటారు. ఫ్రిజ్ లో ఉంచి చల్లగా అయిన తరువాత కూడా వీటిని తీసుకోవచ్చు. అలాగే వేసవికాలంలో ముంజలతో చల్లటి డెజర్ట్స్ కూడా తయారు చేసి తీసుకోవచ్చు. ఎల్లప్పుడూ తాజాగా, మృదువైన ముంజలను చూసి కొనుగోలు చేయాలి. చాలా గట్టిగా ఉన్న ముంజలు ఎక్కువగా పండిపోయే అవకాశం ఉంది. అలాగే వీటిని కొనుగోలు చేసిన వెంటనే తినడం మంచిది. ఫ్రిజ్ లో కూడా ఇవి ఎక్కువ కాలం నిల్వ ఉండవు. ఫ్రిజ్ లో ఉంచడం వల్ల కేవలం ఒకటి నుండి రెండు రోజులు మాత్రమే ఇవి నిల్వ ఉండే అవకాశం ఉంది. ఈ విధంగా వేసవిలో లభించే ఈ ముంజలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, వేసవిలో మామిడిపండ్లతో పాటు వీటిని కూడా తీసుకునే ప్రయత్నం చేయాలని వైద్యులు సూచిస్తున్నారు.

## బనానా షేక్ లేదా అరటి పండ్లు.. రెండింటిలో ఏవి ఎక్కువ మేలు చేస్తాయి..?



మన ఆరోగ్యానికి అరటిపండ్లు ఎంతో మేలు చేస్తాయన్న సంగతి మనకు తెలిసిందే. అరటిపండ్లల్లో ఫైబర్ తో పాటు మన శరీరానికి అవసరమయ్యే ఎన్నో పోషకాలు ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల మన జీర్ణవ్యవస్థకు ఎంతో మేలు కలుగుతుంది. పేగు ఆరోగ్యానికి ఇవి ఎంతో మేలు చేస్తాయి. అలాగే ఇవి సులభంగా జీర్ణమవుతాయి కనుక వీటిని తీసుకోవడం వల్ల తక్షణ శక్తి లభిస్తుంది. అల్పాహారంగా, చిరుతిండిగా లేదా జిమ్ చేసిన తరువాత వీటిని తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. అలాగే కొంత మంది అరటిపండును నేరుగా తినడానికి ఇష్టపడరు. అరటిపండ్లతో బనానా షేక్ వంటి వాటిని తయారు చేసి తీసుకుంటూ ఉంటారు. అయితే అరటిపండ్లను నేరుగా తినడం మంచిదా.. స్నాక్స్ రూపంలో తీసుకోవడం మంచిదా.. అన్న సందేహాలు కూడా మనలో చాలా మందికి వస్తూ ఉంటాయి.

### మిల్క్ షేక్ వద్దు..

అరటిపండును ఏ విధంగా తీసుకోవడం మన ఆరోగ్యానికి, జీర్ణవ్యవస్థకు మంచిదో.. నిపుణులు దీని గురించి ఏమంటున్నారో ఇప్పుడు తెలుసుకుందాం. నిపుణుల అభిప్రాయం ప్రకారం, అరటిపండును ఏ రూపంలో తీసుకోవాలో వ్యక్తి శారీరక శ్రమపై ఆధారపడి ఉంటుంది. పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలనుకునే వారు అరటిపండును నేరుగా తీసుకోవడం మంచిది. జిమ్ కి వెళ్లే వారు, భారీ వ్యాయామాలు చేసే వారికి క్యాలరీలు ఎక్కువగా అవసరమవుతాయి. కనుక వ్యాయామాలు చేసేవారు అరటిపండును మిల్క్ షేక్ రూపంలో తీసుకోవడం మంచిదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇక ఆయుర్వేదం ప్రకారం అరటిపండును నమలి తినడం మంచిదని వారు చెబుతున్నారు. అరటిపండును నమలడం వల్ల లాలాజలంలో ఉండే సమ్మేళనాలు సక్రియం చేయబడతాయి. దీంతో జీర్ణక్రియ సులభతరం అవుతుంది.

### జీర్ణ క్రియకు ఆటంకం..

అరటిపండును నమలడం వల్ల దానిలో ఉండే మొత్తం పోషకాలు శరీరానికి చక్కగా అందుతాయి. అరటిపండుతో స్మూతీ, షేక్ వంటివి చేసి తీసుకోవడం వల్ల దానిని నమలాల్సిన అవసరం లేదు. ఇది జీర్ణవ్యవస్థపై అదనపు భారాన్ని కలిగిస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా ఆయుర్వేదం ప్రకారం రెండు రెండు వేరువేరు పదార్థాలను కలిపి తీసుకోవడం వల్ల శరీర సహజ సమతుల్యం దెబ్బతింటుంది. అరటిపండును పాలతో కలిపి మిక్స్ చేసి తీసుకోవడం వల్ల జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. దీంతో కఫం పెరుగుతుంది. ఇది సైనస్, జలుబు, అలర్జీ వంటి వాటికి దారి తీస్తుంది. బనానా షేక్ పొట్టలోకి చేరిన తరువాత అరటిపండులో ఉండే మాలిక్, సిట్రిక్ ఆమ్లాలు పాలతో కలిసి పెరుగుగా మారుతుంది. దీంతో జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. బనానా షేక్ జీర్ణం అవ్వడానికి సమయం పట్టడంతో పాటు పోషకాలను కూడా శరీరం సరిగ్గా గ్రహించదు. కనుక అరటిపండును నేరుగా తీసుకోవడమే మంచిదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. క్యాలరీలు ఎక్కువగా కావాల్సిన వారు అరటిపండును తిన్న రెండు గంటల తరువాత పాలు తాగడం మంచిదని నిపుణులు తెలియజేస్తున్నారు.

ఇలా చేయడం వల్ల జీర్ణ సమస్యలు రాకుండా ఉండడంతో పాటు శరీరానికి పోషకాలు కూడా చక్కగా అందుతాయి. పొట్ట సంబంధిత సమస్యలతో బాధపడే వారు బనానా షేక్ ను తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిదని నిపుణులు చెబుతున్నారు.

## ఈ నడక గుండెకు భరోసా



తిండి కలిగితే కండ కలదోయ్ అన్నట్టే, కొవ్వు పెరిగితే.. గుండె జబ్బు కలుగోయ్ అంటున్నారు ఫిట్‌నెస్ నిపుణులు. గుండె ఆరోగ్యానికీ, శరీరంలో కొవ్వుకీ సంబంధం ఉంది. గుండెలో ఉన్న సమస్యకు, శరీరంలో ఉన్న కొవ్వుకి ఒకటే పరిష్కారం. వ్యాయామం. ఒకే దెబ్బకు రెండు పిట్టలన్నట్టు. గుండె ఆరోగ్యాన్ని పెంచుకునే వ్యాయామం చేస్తూ.. కొవ్వుని తగ్గించేలా కొన్ని నియమాలు పాటిస్తే డబుల్ బెనిఫిట్స్ ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. అదేమిటంటే... ట్రెడ్ మిల్ మీద కేవలం పరుగే కాక నడకనూ అలవాటు చేసుకోవాలి. రోజువారీగా ట్రెడ్ మిల్ మీద పరుగెత్తే సమయంలో పది నుంచి పన్నెండు శాతం తగ్గించుకోవాలని సూచిస్తున్నారు. ఈ సమయాన్ని నడకకు కేటాయించాలని చెబుతున్నారు. ఆ నడక కూడా ట్రెడ్ మిల్ మీదే. నడకలోనూ వేగం ఉండాలన్నది నిబంధన. గంటకు రెండు నుంచి మూడు మైళ్ల వేగంతో ట్రెడ్ మిల్ స్పీడ్‌ని సెట్ చేసుకోవాలి. ఈ వేగంతో 30 నిమిషాల నుంచి 60 నిమిషాల పాటు వాక్ చేయాలి. ఇలా వారంలో మూడుసార్లు చేస్తే శరీరంలోని కొవ్వు నిల్వలు కరిగిపోవడంతోపాటు రక్తంలోని గ్లూకోజ్ అంతా ఖర్చవుతుందట. కొత్తగా కొవ్వు పేరుకునేకి ఆస్కారమూ ఉండదు. సుదీర్ఘమైన స్పీడ్‌వాక్ గుండె వేగాన్ని మెరుగుపరుస్తుంది. రెండు సమస్యలూ ఉన్నట్లయితే.. మీ వ్యక్తిగత ఫిట్‌నెస్ ట్రైనర్ సలహా తీసుకున్న తర్వాతే ట్రెడ్ మిల్ మీద ముందడుగు వేయండి.

# పాంచజన్యం పూరించిన కవిత




హైదరాబాద్,ఏప్రిల్25 కల్వకుంట్ల కవిత.. ఈ పేరు పెద్దగా పరిచయం అక్కర్లేదు. తెలంగాణలో కవిత అంటే బతుకమ్మ అన్న స్థాయిలో ప్రాచుర్యం పొందారు. తెలంగాణ సంస్కృతిని ప్రపంచవ్యాప్తంగా దివిటీ పట్టి వెలగించారు. తండ్రి కెసిఆర్ ఒడిలో రాజకీయ ఓనమాలు దిద్దుకున్న కవిత..ఇవాళ తండ్రి పార్టీని ధిక్కరించి.. తండ్రినే ఎదిరించి.. నిలదీసే స్థాయిలో..కొత్తగా పార్టీని ప్రకటించి పాంచజన్యం పూరించారు. ఒక్కరోజు తేడాలో పాత టిఆర్ఎస్ అవిర్భావ దినోత్సవం జరుగనుంది. దానికి రెండ్రోజుల ముందు కవిత తన పార్టీ కోసం ఎంచుకున్న తేదీ యాదృచ్ఛికం కాకపోయినా...ముహూర్త బలం ఉండేవుంటుంది. ఓ మహిళగా కవిత మహిళా లోకానికి బాగా తెలుసు. బతుకమ్మతో తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటారు. తెలంగాణ ఉద్యమం లో మమేకం అయ్యారు. తెలంగాణ ఏర్పడితే అందరూ బాగుపడతారని నమ్మి అంతా కెసిఆర్ జెండా మోసారు. కానీ తెలంగాణ ఆగమయ్యింది. కెసిఆర్ కుటుంబం బాగుపడ్డది. అవినీతిలో ఆరితేరారు. లక్షల కోట్లు వెనకేసుకున్నారు. ఈ అవినీతి, తెలంగాణ ఆకాంక్షలను పక్కదారి పట్టించిన తీరుతోనే కెసిఆర్ పార్టీని ప్రజలు బొందపెట్టారు. టిఆర్ఎస్‌ను బిఆర్ఎస్‌గా మార్చాక ఉన్న పేగుబంధం కూడా తెగిపోయింది. బిఆర్ఎస్ అవినీతిని ఎదరించిన రేవంత్ రెడ్డి కూడా ఇప్పుడు అదే దారిలో ప్రయాణిస్తున్నారు. రెండున్న రేళ్లు కావస్తున్నా..ఒక్కటంటే ఒక్క నిర్మాణాత్మక పని చేయలేదు. రేషన్ కార్డులు ఇచ్చాం..సన్న బియ్యం ఇచ్చాం..ఇదే పల్లవి. కానీ ప్రజల బాధ మరోలా ఉంది. ధాన్యం కొనడం లేదు. గిట్టుబాటు ధరలు రావడం లేదు. ఉద్యోగాలు దక్కడం లేదు. అవినీతి పెరిగింది. పైసా ఇవ్వనిదే ఫైలు కదలడం లేదు. కిందిస్థాయి నుంచి మంత్రుల వరకు అవినీతి అంటూ ఆరోపణలు గుప్పుమంటున్నాయి. పేదల ఇళ్లను కూల్చేస్తున్నారు. వెలుగమట్ల ఘటన ఒక్కటి చాలు..పేదలను ఎంతగా రాచి రంపాన పెట్టారో అర్థం చేసుకోవచ్చు. 50శాతం ఉన్న మహిళలు. 50 శాతం ఉన్న దళిత,గిరిజన, బహుజనులకు రాజ్యాధికారంలో చోటులేదు. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో ...తెలంగాణ రాజకీయ యవనికపై కొత్త పార్టీ ఆవిర్భావం అన్నది ఒక అవసరం. ఆవశ్యకత కూడా ఉంది. ప్రజల పక్షాన పోరాడాల్సిన పార్టీ ఒకటి ఇప్పుడు తక్షణా వసరంగా ఉంది. ఎందుకంటే రాజకీయ పార్టీలన్నీ తమ సొంత ఎజెండాతో పనిచేస్తున్నాయి. సొంత వ్యవహారాల కోసం పనిచేస్తున్నాయి. అన్నింటికి మించి అవినీతి, ఆశ్రిత పక్షపాతంలో కూరుకుపోయాయి. కేంద్రంలో అధికారం లో ఉన్న బిజెపి కూడా తెలంగాణకు చేసిందేమీ లేదు. డబుల్ ఇంజిన్ సర్కార్ అంటూ ఊదరగొట్టుడే తప్ప నిలబడి తెలంగాణ పురోగతికి చేసిందేమీ లేదు. నిత్యం విమర్శలు తప్ప మరో ఎజెండా దానికి లేదు. అందుకే గత ఏడాదిగా ప్రజల్లో తిరుగుతూ..వారి సమస్యలను వింటూ. .సమస్యలపై పోరాడుతూ వస్తున్న కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీని ప్రకటించారు. 'తెలంగాణ రాష్ట్ర సేన'గా నామకరణం చేశారు. గతంలో ఓమారు పార్టీ పెడతామని ప్రకటించిన సమయంలో పార్టీ పేరు గురించి అడిగితే ..అప్రయత్నంగానే టిఆర్ఎస్ పేరు కూడా ఖాళీగా ఉందన్నారు. అయితే అంతా టిఆర్ఎస్ పేరును ఓన్ చేసుకుంటుందని భావించారు. కానీ తెలివిగా టిఆర్ఎస్‌నే ప్రకటించినా..తెలంగాణ రాష్ట్రసేనగా ప్రకటించి ఆశ్చర్య పరిచారు. ఇది ఓ రకంగా బిఆర్ఎస్ పార్టీకి షృక్ లాంటిదే. టిఆర్ఎస్ పార్టీని పునరుద్ధరించాలనుకున్న ఆ పార్టీకి ఇదో అశనిపాతం లాంటిదే .నిజానికి గత టిఆర్ఎస్‌లో ఉంటూ.. తెలంగాణ కోసం అనేక కష్టాలు పడి.. పిడికిలి బిగించి కొట్లాడామన్న కవిత మాటలు ముమ్మాటికీ నిజం. జాగృతి ద్వారా తెలంగాణ సాంస్కృతిక దీపాలను వెలిగించారు. తెలంగాణ ఉద్యమకారులకు తెలంగాణ జాగృతి వెలుగునిచ్చింది. తెలంగాణ సమాజానికి కాంతిరేఖగా మారింది. మరోసారి బతుకమ్మను ప్రపంచానికి పరిచయం చేసుకున్నామంటే అందులో కవితనే కనిపిస్తారు. నిజానికి తెలంగాణ తెచ్చుకుంటే దరిద్రం పోతుందన్న భావనలో ఉండి పోరాడిన వారంతా ఆగమయ్యారు. ఆ కలలు నిజం కాలేదు. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రజల ఆర్తిని అర్థం చేసుకోలేకపోయింది. సామాజిక తెలంగాణ రథ చక్రం విరిగి ముక్కలైంది. కొత్త రాష్ట్రంలో జరగాల్సిన పనులు సరిగా జరగలేదు. తెలంగాణ వస్తే బానిస సంకెళ్లు పోతాయని భావించిన వారంతా భంగపడ్డారు. పోరాటంలో ముందున్న కోదండరామ్ లాంటి వారు బయటకు తోయబడ్డారు. ఆయనే మరో పార్టీ పెట్టాల్సి వచ్చింది. కానీ ప్రజల మద్దతుల లేకపోవడంతో ఆయన ఇప్పుడు ఉనికి కోసం పాకులాడుతున్నారు. కాంగ్రెస్ చేస్తున్న అక్రమాలను ప్రశ్నించే శక్తి కూడా లేకుండా పోయింది. తెచ్చుకున్న తెలంగాణలో రైతులకు బేడీలు పడ్డాయి.. లాఠీలు విరిగాయి. ఇసుక దందా వల్ల దళితులు దెబ్బలు తిన్నారు. ఫోన్లు ఎక్కడ వింటున్నారోనని భయం గుప్పిట్లో బతికారు. వ్యక్తిగత స్వేచ్ఛ లేదు. దారుణమైన నిఘా నీడలో తెలంగాణ అంతా బిక్కుబిక్కుమంటూ బతికింది. ఇవన్నీ కళ్లముందు కదలాడుతున్నాయి. బిఆర్ఎస్ పోయి కాంగ్రెస్ వచ్చినా మార్పు రాలేదు. మార్పు తెచ్చామని, స్వేచ్ఛను ఇచ్చామని ప్రకటించుకున్నా..అది సాకారంకాలేదు. సామాజిక తెలంగాణ అన్నది నినాదంగా మారింది. తెలంగాణలోని 3.5 కోట్ల మందికి అమ్మగా పరిణతి చెందాలనుకుంటున్న కవిత కష్టపడితే..ఆ పేరు సంపాదించుకోవచ్చు. కేవలం నినాదాల కోసం కాకుండా ప్రజలను అక్కున చేర్చుకునే అమ్మగా మారితే ప్రజలు బ్రహ్మరథం పడతారు. తెలంగాణ ప్రజలు నమ్మితే ప్రాణం ఇస్తారు. ఉద్యమకారులు పోరాడితేనే కొత్త రాష్ట్రం వచ్చింది. అది గుర్తించి కవిత అడుగుల వేయాల్సి ఉంటుంది. మాటలు చెప్పడం వేరు, అందుకు అనుగునంగా అడుగుల వేయడం వేరు. రాజకీయాల్లో చిరస్థాయిగా నిలవాలంటే నిబద్ధత ముఖ్యం. నిజాయితీ అవసరం. నిలబడే ధైర్యం కావాలి. ప్రజలను ఆకట్టుకునే ప్రసంగాలే కాదు..పనులు చేసే ధైర్యం కనిపించాలి. కవిత ప్రకటించిన ఐదు సూత్రాలను ఆచరణలో పెడితే అద్భుతాలు సాధించవచ్చు. అందుకు కావాల్సిందల్లా ప్రజల పక్షాన పోరాడడం. ఎన్నికలకు మరో రెండేళ్లు గడువు ఉంది. మహిళా రిజర్వేషన్లు కూడా వస్తున్నాయి. మహిళలను, బడుగు బలహీనవర్గాలను రాజ్యాధికారంలో భాగం చేసేలా ప్రణాళికలు రచిస్తే కవిత తప్పకుండా విజయం సాధిస్తారు. రాజకీయ పార్టీగా ముందు నిలబడతారు. అవినీతి లేకుండా సాగుతారన్న నమ్మకం కూడా ముఖ్యం. అందుకు వీరిందరినీ కలుపుకుని పోవడంతో పాటు, గుంటనక్కలను ఎదుర్కొనే చాణక్యం కూడా ముఖ్యం.

# జగనన్న లే ఔట్ పేరుతో భారీ అవినీతి

**నివాస యోగ్యం కాని భూములు కొని నొక్కేశారు**

**కర్రగ్రహారం లే ఔట్‌ను పరిశీలించిన మంత్రి కొల్లు**



మచిలీపట్నం,ఏప్రిల్25: వైసీపీ హయాంలో జగనన్న లే అవుట్ పేరుతో భారీగా అవినీతికి పాల్పడ్డారని మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. నివాస యోగ్యం లేని, సముద్ర తీర భూములను కొనుగోలు చేసి పెద్దఎత్తున కమీషన్లు దండుకున్నారని ధ్వజమెత్తారు. జగన్ హయాంలో నివాస యోగ్యం లేని స్థలాలను పేదలకు కేటాయించారని.. ప్రజలకు కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదని ఆగ్రహించారు. వైసీపీ హయాంలో మచిలీపట్నంలోని కరగ్రహారం గ్రామంలో జగనన్న కాలనీని ఏర్పాటు చేసింది. 300 ఎకరాల్లో జగనన్న లే అవుట్‌ను ఏర్పాటు చేసి 16వేల ఇళ్ల స్థలాలు కేటాయించింది. కనీస సౌకర్యాలు లేకపోవటంతో ఇళ్ల నిర్మాణాలకు లబ్దిదారులు ముందుకు రావడం లేదన్నారు. శనివారం ఆ కాలనీలో పర్యటించి వసతులు, సౌకర్యాలను మంత్రి కొల్లు రవీంద్ర పరిశీలించారు. సెంటు స్థలంలో నిర్మించిన ఇళ్లకు వెళ్లి లబ్దిదారులతో మంత్రి రవీంద్ర మాట్లాడారు. కనీస వసతులు లేవని మంత్రి వద్ద లబ్దిదారులు వాపోయారు. చౌడు భూములు కావడంతో పెద్ద మొత్తంలో నిర్మాణ వ్యయమైందని లబ్దిదారులు తెలిపారు. ఈ కాలనీలో వసతుల కల్పనకు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం కాలనీలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పరిశీలించారు. లబ్దిదారులతో మాట్లాడి నిర్మాణాలు చేపట్టకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజలు నిర్మాణాల కోసం ముందుకు రాకపోతే ఆ స్థలాలను వెంటనే రద్దు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. జగన్ హయాంలో ఈ కాలనీని నిర్లక్ష్యంగా వదిలేయడంతో ఇళ్ల నిర్మాణాల కోసం లబ్దిదారులు ముందుకు రాలేదని మంత్రి చెప్పుకొచ్చారు. రోడ్లు, తాగునీరు, వీధి దీపాలు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వైసీపీ హయాంలో ఏర్పాటు చేసిన కాలనీల్లో సౌకర్యాల కల్పనకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. ఈ కాలనీలో కనీస వసతుల కల్పనకు ప్రణాళికలు తయారు చేస్తున్నామని తెలిపారు. త్వరలోనే ఈ కాలనీలో అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

# కవిత పార్టీతో ఒరిగేదేమీ లేదు


- తెలంగాణలో వచ్చిదే బిజెపియే
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు



హైదరాబాద్,ఏప్రిల్25 : కల్వకుంట్ల కవిత నేడు తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ పేరు ప్రకటించారు. ఇక కవిత కొత్త పార్టీపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు స్పందించారు. కేఏ పాల్ కూడా పార్టీ పెట్టారని గుర్తు చేశారు. ఏ పార్టీ ప్రజల గురించి ఆలోచిస్తుంది.. అనేది ప్రజలు ఆలోచించాలని పిలుపు నిచ్చారు. 12 ఏళ్ల పాలనలో నరేంద్ర మోడీ అవినీతి రహిత పాలన అందించారని చెప్పారు. 'గతంలో టీఆర్ఎస్.. ఇప్పుడు బీఆర్ఎస్ పుట్టబోయే బిడ్డ పేరు టీఆర్ఎస్ అంటా.. ఎన్ని పార్టీలు వచ్చినా.. ఎన్ని పార్టీలు ఉన్నా బీజేపీకి ఇబ్బంది లేదు.. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని రామచందర్‌రావు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. టీఆర్ఎస్ అధినేత్రి కవిత పార్టీ ఆవిర్భావ సభలో బీజేపీపై ఫైర్ అయ్యారు. తెలంగాణ నుంచి 7 మండలాలు లాక్కుంటే బీజేపీ ఎంపీలు మాట్లాడటం లేదన్నారు. 'విభజన హామీలు నెరవేర్చకపోతే బీజేపీ ఎంపీలు మాట్లాడరు. సామాజిక న్యాయానికి బద్ధ వ్యతిరేకి బీజేపీ. తెలంగాణ బీజేపీ ఎంపీలకు సవాల్ విసురుతున్నా.. తెలంగాణ తల్లి బిడ్డలైతే ఏపీలో కలిసిన కనీసం 5 గ్రామాలను వెనక్కి వచ్చేలా చూడాలి. భద్రాచలం వద్ద ఉన్న 5 గ్రామాలు పోతే రాముడి గుడి మునుగుతుంది. గ్రామాలను వెనక్కి తీసుకురావడానికి జాగృతి తరఫున కేంద్రానికి లేఖ రాశాం. మూడు పార్టీలపై అలుపెరగని పోరాటానికి కార్యకర్తలంతా సిద్ధం కావాలని కవిత పేర్కొన్నారు. బిజెపి ప్రజలకోసం పనిచేసే పార్టీ అని రామచంద్రరావు అన్నారు. పార్టీకి కేడర్, లీడర్ ఉన్న పార్టీ అన్నారు. కవిత పార్టీతో తెలంగాణకు ఒరిగేదేమీ లేదన్నారు.

# చంద్రబాబుకు 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్'

**ఎకనమిక్ టైమ్స్ అవార్డు అందచేత**



అమరావతి,ఏప్రిల్25 ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముంబై వేదికగా ప్రతిష్టాత్మకమైన 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్' అవార్డును అందుకున్నారు. ప్రముఖ దినపత్రిక 'ఎకనమిక్ టైమ్స్' సీఎం దార్శనికతకు, పాలనా సంస్కరణలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని ప్రదానం చేసింది.పరిశ్రమల స్థాపన, మౌలిక సదుపాయాల కల్పన, సులభతర వాణిజ్యంలో చంద్రబాబు చూపుతున్న చొరవను కొనియాడుతూ ఎకనమిక్ టైమ్స్ ఈ అవార్డును అందించింది. దేశ ఆర్థిక అభివృద్ధిలో ఏపీని కీలక భాగస్వామిగా మలిచినందుకు ఈ గౌరవం దక్కింది. ఈ సందర్భంగా అమరావతి నిర్మాణం, పేదల సంక్షేమంపై ముఖ్యమంత్రి చేసిన కీలక వ్యాఖ్యలు చేశారు. అమరావతి కేవలం ఒక నగరం మాత్రమే కాదని, అది ప్రజా రాజధాని అని సీఎం అభివర్ణించారు. మరోసారి అమరావతిని నిర్మించే అవకాశం తనకు దక్కడం తన అదృష్టమని సీఎం వ్యాఖ్యానించారు. నవ్యాంధ్ర నిర్మాణంలో అమరావతి ఒక ప్రపంచ స్థాయి ఐకాన్‌గా నిలుస్తోందని ధీమా వ్యక్తం చేశారు. రాజధాని నిర్మాణానికి కేంద్రప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తోందని, నిధుల పరంగా, మౌలిక సదుపాయాల పరంగా మద్దతు లభిస్తోందని వెల్లడించారు. పేదరికం నిర్మూలన కోసం పి-4 విధానాన్ని తీసుకువచ్చామని సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థలు, ప్రజలు కలిసి పేదల అభ్యున్నతికి కృషి చేయడమే ఈ పి-4 లక్ష్యమని వ్యాఖ్యానించారు. సంపదను సృష్టించి, ఆ సంపదను తిరిగి పేదల సంక్షేమానికి మళ్లించేలా ఈ విధానం ఉండబోతుందని సీఎం వివరించారు. ముంబై పర్యటనలో చంద్రబాబుకు లభించిన ఈ గౌరవం ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల ఆకర్షణకు మరింత బలాన్ని చేకూర్చనుందని అధికారులు తెలిపారు. అమరావతిపై సీఎం వ్యక్తం చేసిన విశ్వాసం ప్రజల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని పేర్కొన్నారు.

# లిక్కర్ కేసులో సిట్ ముమ్మర దర్యాప్తు

**హైదరాబాద్‌లో మాజీమంత్రి కారుమూరి విచారణ**

హైదరాబాద్,ఏప్రిల్25 వైసీపీ నేత, మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరావును సిట్ అధికారులు శనివారం హైదరాబాద్‌లో విచారించారు. నాలుగు గంటల పాటు కారుమూరిని విచారించి స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. కారుమూరిని ఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు విచారించారు. మద్యం రవాణా టెండర్ల జారీలో కారుమూరి పాత్రపై సిట్ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సిట్ ఎస్పీ మీడియాతో మాట్లాడారు. ఏపీ లిక్కర్ స్కామ్‌లో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుని విచారించామని తెలిపారు. ఆయన వయసు 60 సంవత్సరాలు పైనే ఉండటంతో చట్టప్రకారం ఆయన కోరిన చోటే విచారించామని వెల్లడించారు. ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశామని సిట్ ఎస్పీ చెప్పుకొచ్చారు. విచారణకు ఆయన సహకరించారని.. అవసరమైతే మరోసారి విచారిస్తామని తెలిపారు. మద్యం రవాణా, టెండర్లు సబ్ కాంట్రాక్టుల అవకతవకల విషయంలో కారుమూరిపై, ఆయన కుమారుడిపై కేసు నమోదైందని చెప్పారు. మద్యం రవాణా ద్వారా ప్రభుత్వ ఆదాయానికి రూ.200 నుంచి రూ. 250 కోట్ల వరకు గండి కొట్టినట్లు ఆయనపై ఆరోపణలు ఉన్నాయని అన్నారు. కారుమూరి కుమారుడు సునీల్‌ను సిట్ కార్యాలయంలోనే విచారిస్తామని స్పష్టం చేశారు. కోర్టు ఆదేశాల ప్రకారం సిట్ ముందు ఆయన కుమారుడు విచారణకు హాజరు కావాలని సూచించారు. అనారోగ్య కారణాలతో సునీల్ సమయం కోరారని.. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని సిట్ ఎస్పీ పేర్కొన్నారు.

# మే 5నుంచి బెంగాల్లో మహిళలకు స్వేచ్ఛ

**రాత్రి ఒంటిగంట తరవాత కూడా స్వేచ్ఛగా రావచ్చు**

**ఎన్నికల ప్రచారంలో కేంద్రహోంమంత్రి అమిత్ షా**



కోల్‌కతా,ఏప్రిల్25 :ప్రస్తుతం బెంగాలీ మహిళలు భయంతో జీవిస్తున్నారని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. మహిళలు సాయంత్రం ఏడు తర్వాత బయటికి రావొద్దంటూ మమతా బెనర్జీ గతంలో చేసిన వ్యాఖ్యలను అమిత్ షా విమర్శించారు. మే ఐదో తేదీ తర్వాతి నుంచి పశ్చిమ బెంగాల్ మహిళలు రాత్రి ఒంటిగంట తర్వాత కూడా భయం లేకుండా రోడ్లపై తిరగొచ్చని అమిత్ షా పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని పూర్బ బర్ధమాన్ జిల్లాలోని జమాల్‌పూర్ గ్రామంలో జరిగిన ఎన్నికల ర్యాలీలో అమిత్ షా పాల్గొన్నారు. రాష్ట్రంలో మహిళల భద్రత విషయంలో విఫలమయ్యారని ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై విమర్శలు గుప్పించారు. 'ఒక మహిళా ముఖ్యమంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరైన

పాలనకు సంకేతమా?' అని ప్రశ్నించారు. భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్న అన్ని రాష్టాల్లోన్రూ మహిళలు ధైర్యంగా ఉన్నారని, మే 5 తర్వాత బెంగాలీ మహిళల పరిస్థితి కూడా మెరుగుపడుతుందని అన్నారు. తల్లులు, సోదరీమణుల వైపు దురుద్దేశంతో చూసేందుకు ఏ దుండగుడు సాహసించినా, వారిని జైలులో పెడతామని భారతీయ జనతా పార్టీ హామీ ఇస్తుందన్నారు. గత పదిహేను సంవత్సరాల మమతా బెనర్జీ పాలనలో, అత్యధికంగా నష్టపోయిన వారు మన తల్లులు, సోదరీమణులే. బెంగాల్‌లో మహిళలపై ఎన్నో హింసాత్మక ఘటనల జరిగాయి. మహిళలు రాత్రి 7 గంటల తర్వాత ఇళ్ల నుంచి బయటకు రాకూడదని దీదీ అంటున్నారు. నేను మీకు చెప్పేదేమిటంటే.. 5వ తేదీ తర్వాత, యువతులు రాత్రి 1 గంట తర్వాత కూడా బయటకు రాగలరు. ఏ దుండగుడూ ఆమె వైపు చూడటానికి కూడా సాహసించదని అమిత్ షా హామీనిచ్చారు.

# మెక్సికోలో వారణాసి సందడి

### భారతీయ పురాణగాథలకు యాక్షన్ మేళవింపు

### రాజమౌళి వీడియో వైరల్

భారతీయ సినిమా ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కలయికలో రూపుదిద్దుకుంటున్న భారీ బ్జడెట్ చిత్రం 'వారణాసి'. ఈ చిత్రం తాజాగా మెక్సికో సిటీలో జరుగుతున్న అతిపెద్ద పాప్ కల్చర్ ఫెస్టివల్ లో సందడి చేసింది. ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌లో ప్రదర్శించిన ఫస్ట్ గ్లింప్స్ చూసి అంతర్జాతీయ ప్రేక్షకులు ఫిదా అయ్యారు. ఇక ఈ వేడుకకు రాజమౌళి స్వయంగా హాజరు కాలేకపోయినప్పటికీ, ఆయన పంపిన ప్రత్యేక వీడియో సందేశం ఇప్పుడు ఇంటర్నెట్‌ను ఊపేస్తోంది. మెక్సికో అభిమానులందరికీ నమస్కారం! 'వారణాసి' కేవలం ఒక సినిమా మాత్రమే కాదు.. అదొక అద్భుతమైన సాహసయాత్ర. భారతీయ పురాణ గాథలను , ప్రపంచస్థాయి యాక్షన్‌తో మేళవించి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం అని రాజమౌళి పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ సినిమాలో మహేశ్ బాబును రాజమౌళి చూపిస్తున్న విధానంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రపంచ ప్రేక్షకులు మునుపెన్నడూ చూడని ఒక కొత్త మహేశ్‌ను ఈ సినిమాలో చూస్తారు అని జక్కన్న భరోసా ఇవ్వడం గమనార్హం. గ్లింప్స్‌లో మహేశ్ బాబు పొడవాటి జుట్టు, రఫ్ గడ్డంతో చాలా కరుకుగా కనిపించారు. మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలో షూట్ చేసిన యాక్షన్ సీక్వెన్స్ హాలీవుడ్ స్థాయిని మించి ఉన్నాయని అక్కడి ప్రేక్షకులు ప్రశంసిస్తున్నారు. కాగా ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. దాదాపు రూ. 1300 కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న 'వారణాసి' మూవీ ఇప్పుడు ఇండియాలోనే మోస్ట్ వాంటెడ్ ప్రాజెక్ట్‌గా నిలిచింది. ఈ సినిమా గురించి వచ్చే చిన్న వార్త అయినా సోషల్ మీడియాను ఊపేస్తోంది. నిర్మాతలలో ఒకరైన ఎస్.ఎస్. కార్తికేయ ఈ ఈవెంట్‌కు హాజరై, అక్కడ వారణాసికి సంబంధించిన ఒక స్పెషల్ 'ప్రీ గ్లింప్స్'ను ప్రదర్శించారు. ఈ




సందర్భంగా రాజమౌళి పంపిన వీడియో మెసేజ్ ఇప్పుడు గ్లోబల్ వైడ్‌గా వైరల్ అవుతోంది.

# టాక్సిక్‌లో యాక్షన్ సన్నివేశాలు అదుర్స్

### దర్శకురాలు గీతూమోహన్ ప్రతిభ అద్భుతం అన్న యశ్




యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో రానున్న చిత్రం 'టాక్సిక్' ఈ సినిమా టీజర్ విడుదలైన నాటి నుంచి చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. 'టాక్సిక్'లోని సన్నివేశాల గురించి యశ్ ఇటీవల సినిమాకాన్ వేడుకలో మాట్లాడారు. ఈ యాక్షన్ చిత్రాన్ని ఒక మహిళా దర్శకురాలు తెరకెక్కిస్తున్నందువల్ల సరికొత్తగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా దర్శకురాలు గీతూ మోహన్ దాస్‌పై ప్రశంసలు కురిపించారు. 'సాధారణంగా గ్యాంగ్‌స్టర్ డ్రామాలు అంటే పురుష దర్శకులే బాగా చేస్తారనే భావన చాలామందిలో ఉంటుంది. కానీ, ఈ గ్యాంగ్‌స్టర్ కథను ఒక మహిళా కోణంలో చూపించడం అనేది చాలా కొత్తగా ఉంటుంది. ఇందులోని శృంగార సన్నివేశాల నుంచి యాక్షన్ సీన్స్ వరకు ప్రతి దానిలోనూ ఆమె ఆలోచనలు చాలా స్పష్టంగా ఉన్నాయి. సున్నితమైన భావాలను ఎంత హృద్యంగా చూపించారో.. యాక్షన్ సన్నివేశాలను కూడా అదే స్థాయిలో తెరకెక్కించారు. అన్నిరకాల భావోద్వేగాలను లేడీ డైరెక్టర్ ఇంత బాగా ప్రజెంట్ చేయగలరా అని ఆమెతో ప్రయాణించాకే నాకు అర్థమైంది. ఇందులోని సన్నివేశాలు గతంలో చూడనివిధంగా విభిన్నంగా ఉంటాయి. గీతూ గొప్ప రచయిత కూడా.. ఆమె నుంచి నేను ఎన్నో విషయాలు నేర్చుకున్నాను' అని యశ్ అన్నారు. ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. యశ్ సరసన ఐదుగురు హీరోయిన్స్ నటిస్తున్నారు. మొదట ఈ చిత్రాన్ని మార్చిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని అనుకున్నారు. కొన్ని కారణాల వల్ల జూన్ 4కు వాయిదా పడింది.

# మాయన్ నాగకరికత అంటే ఇష్టం

### బాహుబలిలో అదే అనుసరించా

### వారణాసి కోసం మహేశ్ బాబు కష్టపడుతున్నారు

మాయన్ నాగరికత.. వారి కట్టడాలు.. ఎప్పుడూ నన్ను విస్మయానికి గురిచేస్తూనే ఉంటాయి. 'బాహుబలి' సినిమాలో చూసిన మాహిష్మతి నగరం, అందులోని సిటీ సెంటర్ ఆ అద్భుతమైన సింహాసనం.. వీటన్నిటికీ మెక్సికోలోని ప్రసిద్ధ




చిచెన్ ఇట్జా పిరమిడ్లే ఇన్‌స్పిరేషన్‌గా నిలిచాయని, రాజమౌళి తన గత చిత్రాల్లోనే ఈ మెక్సికన్ ఆర్కిటెక్చర్ నుంచి స్ఫూర్తి పొందానని ఈ వీడియోలో తొలిసారి బయటపెట్టారు. ఇక ఇండియన్ మైథాలజీని, గ్లోబల్ స్టాండర్డ్ యాక్షన్ ఎలిమెంట్స్‌తో కలిపి ఒక కొత్త ప్రపంచాన్ని సృష్టించిన వారణాసి ప్రీ గ్లింప్స్‌కు అక్కడి ఆడియెన్స్ ఫిదా అయ్యారు. ఈ సినిమా మేకింగ్ హాలీవుడ్ రేంజ్‌లో ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇక మరోవైపు 'వారణాసి' కోసం మహేష్ బాబు పడుతున్న కష్టం అంతా ఇంతా కాదు. ప్రస్తుతం హైదరాబాద్ షెడ్యూల్ ముగియడంతో షూటింగ్‌కు చిన్న గ్యాప్ దొరికింది. కానీ రాజమౌళి మాత్రం మహేష్ బాబుకు విశ్రాంతి ఇవ్వకుండా నేరుగా ఆయనను విదేశాలకు పంపించారు. త్వరలోనే 'వారణాసి' తదుపరి షెడ్యూల్ అంటార్కిటికాలోని కఠినమైన మంచు గడ్డల మధ్య జరుగుతుండడంతో అక్కడి మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలకు మహేష్ బాబు శరీరం అలవాటు పడేలా, ప్రస్తుతం ఆయనకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారట. ఎక్కడా టైమ్ వేస్ట్ కాకూడదని జక్కన్న పక్కా ప్లానింగ్‌తో ఉన్నారు. మంచు కొండల్లో చేసే సాహసోపేతమైన పోరాట సన్నివేశాల కోసం మహేష్ ఇప్పుడు మోషన్ క్యాప్చర్ టెక్నాలజీపై కూడా వర్క్ చేస్తున్నారు. అడ్వెంచర్ అంటే ఇలా ఉండాలని రాజమౌళి చూపిస్తున్నారు. ఈ సినిమాలో మహేష్ బాబు రుద్ర అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనుండగా, గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా మందాకిని పాత్రలో నటిస్తున్నారు. విలక్షణ నటుడు పృధ్వీరాజ్ సుకుమారన్ కుంభ అనే పాత్రలో కనిపించబోతున్నారు. ఆగస్ట్ నాటికి షూటింగ్ మొత్తం పూర్తి చేసి, ఆ తర్వాత పోస్ట్ ప్రొడక్షన్ పనులపై దృష్టి పెట్టాలని టీమ్ లక్ష్యంగా పెట్టుకుంది. 2027 ఏప్రిల్ 7న సమ్మర్ కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న వారణాసి భారతీయ సినిమా సత్తాను గ్లోబల్ మార్కెట్‌లో మరోసారి చాటడం ఖాయంగా కనిపిస్తోంది. జక్కన్న మార్క్ గ్రాఫిక్స్, కీరవాణి సంగీతం ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లడం గ్యారెంటీ.




నేను 25 ఏళ్ల నుంచి సినిమాలు చేస్తున్నా. మనం ఎంతో కష్టపడి తెరకెక్కించిన చిత్రానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తే ఆ ఆనందం మాటల్లో చెప్పలేం. మీరంతా 'ఆర్ఆర్ఆర్'ను ఆదరించినప్పుడు నా సంతోషానికి అవధులు లేవు. 'నాటు నాటు' పాటకు ప్రపంచమంతా కాలు కదిపింది. ఆ మూమెంట్స్ చూసినప్పుడు భావోద్వేగానికి గురయ్యాను. నేను సినిమాలు ఎందుకు తీస్తున్నానో అప్పుడే అర్థమైంది' అని రాజమౌళి తెలిపారు.

# సల్మాన్ మూవీకి స్పిరిట్ పోటీ కానుందా?




బాలీవుడ్ కండలవీరుడు సల్మాన్ ఖాన్ కు ప్రస్తుతం కాలం కలిసిరావడం లేదు. ఒకప్పుడు బాక్సాఫీస్‌ను షేక్ చేసిన సల్మాన్‌ఖాన్, 2016లో వచ్చిన 'సుల్తాన్' సినిమా తర్వాత మళ్ళీ ఆ స్థాయి బ్లాక్ బస్టర్‌ను చూడలేదు. భారీ అంచనాల మధ్య వచ్చిన 'టైగర్ 3, సికిందర్' సినిమాలు కూడా ప్రేక్షకులను నిరాశపరిచాయి. ఈ ఏడాది రిలీజ్ కావాల్సిన 'మాతృభూమి' సినిమాపై పెద్దగా అంచనాలు లేవు. దీంతో సల్మాన్ మార్కెట్ పడిపోతుందా? అనే అనుమానాలు మొదలయ్యాయి. ఇలాంటి తరుణంలో టాలీవుడ్ సెన్సేషనల్ ప్రొడ్యూసర్ దిల్ రాజు రంగంలోకి దిగారు. ఎంతో కాలంగా బాలీవుడ్‌లో గ్రాండ్ ఎంట్రీ ఇవ్వాలనుకున్న దిల్ రాజు ఈ సారి దర్శకుడు వంశీ పైడిపల్లిని రంగంలోకి దించి ఒక పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్‌ను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం, షూటింగ్ కూడా శరవేగంగా జరుపుకుంటోంది. ఈ సినిమాతోనైనా సల్మాన్ బాక్సాఫీస్ వద్ద తన పూర్వ వైభవాన్ని పొందుతారని అభిమానులు ఆశిస్తున్నారు. అయితే, ఇక్కడే ఒక పెద్ద ట్విస్ట్ ఉంది..! సల్మాన్ ఖాన్‌కు ఈద్ అంటే చాలా సెంటిమెంట్. ప్రతి ఏటా తన సినిమాను ఆ పండుగకే రిలీజ్ చేస్తారు. రాబోయే ఏడాది కూడా మార్చి 9 లేదా 10 తేదీల్లో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నారు. చాలా మందికి తెలిసిన విషయం ఏంటంటే.. అంతకంటే ముందే, అంటే మార్చి 5న పాన్ ఇండియా వైడ్ ఒక భారీ తుపాను రాబోతోంది. అదే.. సందీప్ రెడ్డి వంగా, రెబల్ స్టార్ ప్రభాస్ కాంబినేషన్‌లో వస్తున్న 'స్పిరిట్' యానిమల్' తర్వాత సందీప్ వంగా నుంచి వస్తున్న సినిమా కావడంతో పాటు, ఇప్పటికే విడుదలైన ఆడియో టీజర్, ఫస్ట్ లుక్ పోస్టర్ 'స్పిరిట్'పై అంచనాలను భారీగా పెంచేశాయి. వచ్చే ఏడాది అందరికన్నా ముందే సినిమా రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేయడంతో మిగతా హీరోలు తమ సినిమాలను వాయిదా వేసుకుంటారు. కానీ, సల్మాన్ ఖాన్ మాత్రం పక్కాగా అదే వారంలో బరిలోకి దిగుతున్నారు. 'స్పిరిట్' రిలీజ్ అయిన కేవలం 5 రోజుల గ్యాప్‌లోనే సల్మాన్ సినిమా రావడం ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. ఈ 5 రోజుల గ్యాప్ అనేది రెండు సినిమాలపై ప్రభావం చూపుతుంది. 'స్పిరిట్'కు టాక్ పాజిటివ్‌గా వస్తే, ఆ ప్రభంజనాన్ని తట్టుకోవడం సల్మాన్ సినిమాకు చాలా కష్టం. ఒకవేళ 'స్పిరిట్' ఏ కారణం చేతనైనా వాయిదా పడితే మాత్రం సల్మాన్ ఖాన్‌కు అది పెద్ద అడ్వాంటేజ్ అవుతుంది.



# సాయి సుదర్శన్ సెంచరీ చేసినా గుజరాత్ కు నిరాశే...

డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఈ సీజన్‌లోనూ అదరగొ డుతూ మరో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. సాయి సుదర్శన్ సెంచరీతో విజృంభించినా కూడా గుజరాత్ టైటాన్స్‌కు నిరాశే ఎదురైంది. విరాట్ కోహ్లీ, పడిక్కల్ వేగంగా చేసిన అర్థ సెంచరీలతో మిగతా బ్యాటర్లు దూకుడుగా ఆడడంతో బెంగళూరు ఐదో విజయాన్ని సొంతం చేసుకుంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 205 పరుగులు చేసింది. శుభ్‌మన్ గిల్‌తో కలిసి సాయి సుదర్శన్ అదిరే ఆరంభమిచ్చారు. ఓపెనర్ సాయి



సుదర్శన్(100) సంచలన ఇన్నింగ్స్ ఆడి సెంచరీ నమోదు చేశాడు. బౌలర్లను ఎడాపెడా ఉతికేసిన సాయి శతకం బాట పట్టాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(32)తో రాణించగా.. జోస్ బట్లర్(25) మెరిశాడు. జేసన్ హోల్డర్(23 నాటౌట్), వాషింగ్టన్ సుందర్ (19) కొన్ని షాట్లు ఆడడంతో గుజరాత్ భారీ స్కోర్ నమోదుచేసింది. పరుగులకు కళ్లెం వేసినా వికెట్లు తీయడంలో బెంగళూరు బౌలర్లు విఫలమయ్యారు. అతికష్టంగా మూడు వికెట్లు తీయగా.. భువనేశ్వర్ కుమార్, జోష్ హేజిల్‌వుడ్, సుయాశ్ శర్మ ఒక్కో వికెట్ పడగొట్టారు. గుజరాత్ విధించిన లక్ష్యాన్ని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐదు వికెట్ల నష్టానికి 18.5 ఓవర్లలోనే ఛేదించింది.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers,
RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609